ప్రజాశక్తి

సోమవారం 28 నవంబర్ 2022 | 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా

ఆశలు గల్లంతు



- అటకెక్కిన ఎంఐజి కాలనీల ఏర్పాటు ప్రక్రియ
- జిల్లాలో ఇళ్ల ప్లాట్లకు దరఖాస్తులు 9,708
- కొనుగోలు చేయాల్సిన భూమి 808.04

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

మచిలీపట్నం నగరపాలక సంస్థతోపాటు జిల్లాలోని నాలుగు మున్సిపాల్టీల సమీపంలో ఎక్కడా జగనన్న టౌన్‌షిప్‌లు కార్యరూపం దాల్చలేదు. మిడిల్ ఇన్‌కం గ్రూప్ (ఎంఐజి) కాలనీల ఏర్పాటు ప్రక్రియ జిల్లాలో అటకెక్కింది. దీంతో ప్రభుత్వం సకల సౌకర్యాలతో అభివృద్ధి చేసిన టౌన్‌షిప్ లే అవుట్లలో ప్లాట్లు కొనుగోలకు దరఖాస్తు చేసుకున్న మధ్యతరగతి ఆదాయవర్గాలు, ఉద్యోగులు ఆశలు అడియాశలయ్యాయి.

పట్టణాల సమీపంలోని పల్లెల్లో సైతం గజం స్థలం రూ. 10 వేలు పైగా ధర పలుకోతుంది. సెంటు స్థలం కొనాలన్నా రూ. 5 లక్షలు ఖర్చు చేయాలి. మధ్యతరగతి ఆదాయ వర్గాలు, ఉద్యోగులు ఇంటి స్థలం కొనుగోలు చేయడం గగనం మారింది. ఈ క్రమంలోనే ప్రభుత్వం జగనన్న టౌన్ షిప్ పేరిట సకల సౌకర్యాలతో లే అవుట్లు ఏర్పాటు చేసి తక్కువ మొత్తానికే పట్టణ, నగర పరిధిలోని మధ్యతరగతి ఆదాయ వర్గాలు, ఉద్యోగులకు ఇంటి స్థలాలను అందిస్తామని ప్రకటించింది. ఈ ఏడాది జనవరిలో వెబ్‌సైట్ ఏర్పాటు చేసి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించింది. పట్టణాలు, నగరాల సమీపంలోనే స్వంత ఇంటి స్థలం సమకూర్చుకోవచ్చని మధ్యతరగతి ఆదాయ వర్గాలు ఆశించాయి. జిల్లాలోని మచిలీపట్నం నగరపాలక సంస్థతోపాటు మరో నాలుగు మున్సిపాల్టీల్లో 9,708 మంది దరఖాస్తు చేసుకున్నారు. మిడిల్ ఇన్‌కం గ్రూప్ (ఎంఐజి) కాలనీల ఏర్పాటుకు 808 ఎకరాల 04 సెంట్లు భూమి సేకరించి లే అవుట్లు ఏర్పాటు చేసి ప్లాట్లు అందించాలని జిల్లా యంత్రాంగం నివేదికలు ప్రభుత్వానికి పంపింది. ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదు. అమరావతి అభివృద్ధి సంస్థ (ఎపి సిఆర్‌డిఎ), మచిలీపట్నం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ముడ)లు పట్టణాభివృద్ధి సంస్థలు బ్యాంకు రుణాలను తీసుకుని ప్రయివేటు భూమిని సేకరించి లే అవుట్లు ఏర్పాటు చేయాలని సూచించింది. ఆరు నెలల్లో లే అవుట్లలోని ప్లాట్లు విక్రయించి రుణాలు తీర్చాలనే నిబంధనలను ప్రభుత్వం విధించింది. ఆరు నెలల్లో లే అవుట్ ఏర్పాటు, పూర్తి స్థాయిలో ప్లాట్లు విక్రయించి బ్యాంకు రుణాలు తీర్చడం సాధ్యం కాదని పట్టణాభివృద్ధి సంస్థలు భూ సేకరణకు ముందుకు రాలేదు. దీంతో ఎంఐజి కాలనీల ప్రణాళిక అటకెక్కింది.

నగరం	దరఖాస్తులు	సేకరించాల్సిన భూమి (ఎకరాల్లో)
మచిలీపట్నం	2,226	178.89
పెడన	260	21.81
గుడివాడ	3,648	311.63
వుయ్యూరు	360	29.22
వైఎస్సార్ తాడిగడప	3,214	266.49
మొత్తం	**9,708**	**808.04**

ప్రభుత్వ మద్యం దుకాణంలో అవినీతి

రూ.31 లక్షలు స్వాహా జరిగినట్లుగా గుర్తింపు

ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు: పెనుగంచిప్రోలు వైపిఆర్ గార్డెన్స్‌లోని మద్యం దుకాణాల్లో సూపర్‌వైజర్ చేతివాటం ప్రదర్శించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మద్యం దుకాణంలో రూ.31,99,700 విలువ చేసే మద్యం బాటిళ్ల పక్కదారి పట్టించి అవకతవకలకు పాల్పడినట్లుగా అధికారులు గుర్తించారు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్లో ప్రోహిబిషన్, ఎక్సైజ్ అధికారులు ఫిర్యాదు చేశారు. రెండు రోజుల నుండి ప్రోహిబిషన్, ఎక్సైజ్ అధికారులు, ఎస్ఇబి సిఐ వైకుంఠరావు, ఎస్ఐ చంద్రశేఖర్ తమ సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. దుకాణంలో అక్రమాలు జరిగినట్లుగా గుర్తించారు. దుకాణంలో ఉన్న మద్యం స్టాకు వివరాలు సేకరించారు. వాస్తవంగా ఉండాల్సిన నిల్వలు గురించి అడగ్గా సిబ్బంది సమాచారం ఇవ్వలేదు. సూపర్‌వైజర్ అందుబాటులో లేరీ, తమకేమీ తెలియదంటూ పేర్కొన్నారు. దర్యాప్తు పూర్తయిన తర్వాత ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని వై.కుంఠరావు, చంద్రశేఖర్ వెల్లడించారు. శనివారం సాయంత్రం పెనుగంచిప్రోలు పోలీస్ స్టేషన్‌లో మద్యం దుకాణం సూపర్ వైజర్ బోశెట్టి. త్రినాథ్, ముగ్గురు సేల్స్‌మేన్స్‌పై ఫిర్యాదు చేశారు. స్థానిక ఎస్ఐ హరి ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెపారు. గతంలో కూడా పలుమార్లు ఇదే మద్యం (మిగతా 6లో)

రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా శిల్పారెడ్డి



ప్రజాశక్తి-తోట్లవల్లూరు: తోట్లవల్లూరు మండలంలోని చాగంటిపాడు గ్రామానికి చెందిన మర్రెడ్డి శిల్పారెడ్డి రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ నియమితులయ్యారు. ఈ మేరకు సీఎం జగన్మోహన్‌రెడ్డి తనను ఎన్నిక చేశారని ఆదివారం పాత్రికేయుల సమక్షంలో శిల్పారెడ్డి తెలిపారు. గత అసెంబ్లీ సమావేశాల్లో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్లను నియమించారని, అందులో భాగంగా కృష్ణాజిల్లా నుంచి తనను నియమించి నియామక పత్రాన్ని అందజేశారని తెలిపారు. ఈనెల 29వ తేదీన విజయవాడలోని రహదారులు, భవన నిర్మాణాల శాఖ కార్యాలయంలో తన ప్రమాణ స్వీకార కార్యక్రమం జరుగుతుందని ఆమె తెలిపారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ పెద్దేశ్వరరావు

కోవిడ్ బాధితులకు

గుండె పరీక్షలు తప్పనిసరి

ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ పల్లెం పెద్దేశ్వరరావు

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్

కోవిడ్ భారిన పడి కోలుకున్న వారు తప్పనిసరిగా గుండె పరీక్షలు చేయించుకోవాలని ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ పల్లెం పెద్దేశ్వరరావు అన్నారు. అంతర్జాతీయ సేవా సంస్థ లయన్స్ క్లబ్ ఆఫ్ మచిలీపట్నం, విజయవాడ డాక్టర్ పల్లెం పెద్దేశ్వరరావు హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం మచిలీపట్నం హిందూ కాలేజీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్యశిబిరాన్ని డాక్టర్ పల్లెం పెద్దేశ్వరరావు ప్రారంభించి మాట్లాడారు. మారుతున్న కాలానుగుణంగా 30 సంవత్సరాలు దాటిన యువకుల్లో కూడా గుండెకి సంబంధించిన వ్యాధులు కన్పిస్తున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ నడక, వ్యాయామం, యోగా కార్యక్రమాలతో పాటు మితమైన పౌష్టికాహారాన్ని భుజించడం ద్వారా గుండె జబ్బులు నివారించుకోవచ్చని తెలిపారు. తల్లిదండ్రులకి గుండె జబ్బు ఉంటే పిల్లలు 50 సంవత్సరాలు వయస్సు దాటిన తర్వాత పరీక్షలు చేయించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మచిలీపట్నంలో పుట్టి చదువుకున్న తనకు ఇక్కడ ఉచితంగా వైద్యం అందించాలని సంకల్పంతో లయన్స్ క్లబ్ సహకారంతో కార్యక్రమం ఏర్పాటు చేశామని చెప్పారు. గుండె నొప్పి వచ్చిన గంట సమయంలోపు గోల్డెన్ (మిగతా 6లో)

పారదర్శకంగా లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు

డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ కిరణ్‌కుమార్





ప్రజాశక్తి-విజయవాడ: ఎన్‌టిఆర్ జిల్లా సంక్షేమ పథకాల అమలులో ప్రగతి పథంలో నడుస్తుందని ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్.కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను క్షేత్ర స్థాయిలో సక్రమంగా అమలు చేయించడంలో జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు ఆదేశాల మేరకు పలు చర్యలు తీసుకుంటున్నట్లు పీడీ తెలిపారు. జిల్లాలో సంక్షేమ పథకాలు, వాటి అమలు తీరును ఆయన పీడీ 'ప్రజాశక్తి'కి వివరించారు.

ప్రశ్న: వైఎస్ఆర్ చేయూత ద్వారా జిల్లాలో ఎంత మందికి లబ్ధి చేకూరింది?

జవాబు: రాష్ట్ర ప్రభుత్వం ప్రజలసంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ పథకాన్ని అమలు చేయడం జరుగుతుంది. ఈ పథకం ద్వారా ఈ రెండేళ్లలో జిల్లాలోని ఒక లక్షా 74, 446 మందికి ఒక్కొక్కరికి రూ. 18, 750 చొప్పున రెండు విడతల్లో సుమారు రూ. 327 కోట్ల వరకు పంపిణీ చేయడం జరిగింది.

ప్రశ్న: వైఎస్ఆర్ ఆసరా ద్వారా రుణ మాఫీ కింద రెండవ విడతకు ఎన్ని గ్రూపులకు ఎంతెంత ఇచ్చారు?

జవాబు: వైఎస్ఆర్ ఆసరా ద్వారా గ్రూపు సభ్యులకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. రెండవ విడతలో 31,753 గ్రూపులలోని మూడు లక్షల 16 వేల 410 మంది సభ్యులకు సుమారు రూ. 275.98 కోట్లు మేర రుణ మాఫీ రూపంలో లబ్ధి చేకూరింది.

ప్రశ్న: 'ఉన్నతి' పథకం అమలు తీరు ఎలా ఉంది?

జవాబు: ఈ పథకం ద్వారా సమాజంలో వెనుకబడిన ఎస్‌సి, ఎస్‌టి వర్గాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. జిల్లాలోని 135 మంది ఎస్‌సిలకు, మరో 62 మంది ఎస్‌టిలకు ఒక్కొక్కరికి రూ. 50 వేల చొప్పున రూ. 98.50 లక్షలు వడ్డీ లేని రుణ సదుపాయం కల్పించడం జరిగింది.

ప్రశ్న: బ్యాంక్ లింకేజీ ద్వారా ఈ ఆర్థిక సంవత్సరంలో ఎన్ని సంఘాలకు రుణ సదుపాయం కల్పించారు?

జవాబు: జిల్లాలోని 9,178 సంఘాలకు సుమారు రూ.454.97 కోట్ల మేర రుణాలు మంజూరు చేయడం జరిగింది.

ప్రశ్న: స్త్రీ నిధి పథకం అమలు తీరు ఎలా ఉంది?

జవాబు: ఈ పథకం ద్వారా ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.26 కోట్ల మేర 4,500 మంది లబ్ధిదారులకు వడ్డీ లేని రుణాలు మంజూరు అయ్యాయి.

ప్రశ్న: జీవనోపాదులు పథకం ద్వారా లబ్ధి ఎంత మందికి కల్పించారు?

జవాబు: ఈ ఆర్థిక సంవత్సరానికి 102 మందికి రూ.40 వేల చొప్పున రూ.40.80 లక్షల మేర లబ్ధి చేకూరగా, ఈ పథకంలో భాగంగానే ప్రధాన మంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల (పిఎం ఎఫ్ఎంఇ) ద్వారా పెద్ద వ్యాపారదారులకు ఈ ఏడాదిలో 29 మంది లబ్ధిదారులకు రూ. 68.47 లక్షల మేర పంపిణీ జరిగింది.

ప్రశ్న: "జగనన్న తోడు" పథకం ద్వారా ఎంత మందికి లబ్ధి చేకూరింది?


జవాబు: ఈ పథకం ద్వారా ఈ ఏడాది 3,218 మందికి రూ. 10 వేలు చొప్పున రూ. మూడు కోట్ల 21 లక్షల 80 వేలు ఇవ్వడం జరిగింది.

ప్రశ్న: జిల్లాలో పింఛన్ దారులు (మిగతా 6లో)

బధిర విద్యార్థికి ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

పట్టణంలోని స్థానిక బాలురు ఉన్నత పాఠశాల 1987-88 పూర్వ విద్యార్థులు ఆదివారం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలోని బాదిరుని చదువులకు 30 వేల ఆర్థిక సహాయం అందజేశారు. తమ సహచర పూర్వ విద్యార్థి పున్నా లక్ష్మణరావు పెద్ద కుమారుడు పున్నా పవన్ కుమార్ పుట్టుకతోనే బాదరత్వం కలిగి ఉన్నాడు. ప్రస్తుతం హైదరాబాదులోని బధిర కళాశాలలో బీకాం మొదటి సంవత్సరం చదువుతున్నాడు. తన తండ్రి చిరుద్యోగి కావడంతో కాలేజీ ఫీజు కట్టలేని పరిస్థితులలో వారి కుటుంబం 1987-88 బాలుర ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులను ఆశ్రయించారు. దీంతో స్పందించిన పూర్వ విద్యార్థులు తక్షణ సహాయం కింద 30 వేల రూపాయలు విద్యార్థికి అందజేశారు. పవన్ కుమార్ సైగలతో స్పందిస్తూ పూర్వ విద్యార్థులు కతజ్ఞతలు తెలిపారు. కాగా తన చదువుకు ల్యాప్ ట్యాప్ అవసరాన్ని పూర్వ విద్యార్థులు దష్టికి తీసుకురాగా సాధ్యమైనంత వరకు ప్రయత్నిస్తామని, అవసరమైతే బయట వారి సహాయంతో నైనా ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులు మానేపల్లి కష్ణయ్య, పీడీ నాయక్, పూర్వ విద్యార్థులు వరగాని రవి, బి శ్రీనివాసరావు, జి నాగేశ్వరరావు, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.



సాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

వ్యక్తి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - తిరువూరు

తిరువూరు మండలం ఎరుకోపాడు గ్రామ సమీపంలో ఎన్ఎస్పీ కాలువలో పడి కొమ్మిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన బంకా అంజియ్య(55) అనుమానాస్పదంగా ఆదివారం మృతిచెందాడు. పోలీసులకు గ్రామస్తులు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ దుర్గాప్రసాద్ సిబ్బందితో వెళ్లి కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం చేయించారు.



గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధం

ప్రజాశక్తి-తిరువూరు

తిరువూరు మండలం కాకర్ల గ్రామంలో గ్యాస్ సిలిం డర్ పేలడంతో ఇల్లు దగ్ధమైన సంఘటన ఆదివా రం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కోట జమలమ్మ కుటుంబ సభ్యులతో కలిసి చర్చికెళ్లింది. ఇంటిలో ఉన్న గ్యాస్ సిలిండర్ పేలడంతో ఆమె పూరిల్లు పూర్తిగా కాలి బూడెదయింది. భారీ శబ్ధంతో సిలిండర్ పేలడంతో ప్రజలు తీవ్ర భయాందోళన చెందారు. ఫైరింజ న్ సిబ్బంది వచ్చి మంటల చుట్టుప క్కల వ్యాపించకుండా అదుపుచేశారు. కూలి డబ్బుల, బంగారు ఆభరణాలు, విలువైన పత్రా లు, వాహనం, ఇంటి సామగ్రి పూర్తిగా అగ్నికి ఆహుతవటంతో జమలమ్మ కుటుంబం కట్టుబట్టలతో రోడ్డున పడ్డారు. గ్రామానికి చెందిన వైసిపి నా యుకుడు, లక్ష్మీపురం సొసైటీ చైర్మన్ తాళ్లూరి నవీన్ కుమార్ జమలమ్మ కుటుంబాన్ని పరామర్శించి, ధైర్యం చెప్పి ఆర్థిక సహాయం చేస్తానని హామీ ఇచ్చారు

గడపగడపకూ మనప్రభుత్వం


ప్రజాశక్తి-జగ్గయ్యపేట

పట్టణంలోని మూడవ వార్డ్ నందు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం రాత్రి నిర్వహించారు. శాసనసభ్యులు సామినేని ఉదయభాను తనయుడు సామినేని వెంకట కష్ణ ప్రసాద్ పాల్గొని ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్ కిషోర్, కాశీ అనురాధ, ముస్లిం మైనార్టీ అధ్యక్షులు మొయిద్దీన్, మున్సిపల్ కో ఆప్షన్ నెంబర్ ఖాదర్ బాబు, వార్డ్ నాయకులు పీఎం ఖాన్, పి రామారావు, స్థానిక ప్రజా ప్రతినిధులు, వివిధ గ్రామ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు, చీరెలు

ప్రజాశక్తి -నందిగామ

సెమి క్రిస్మస్, క్రీస్తు విజ్ఞాన సువార్త మహాసభలు సందర్భంగా నందిగామ మండలం కేతవీరునిపాడు గ్రామంలో శనివారం రాత్రి వద్ధులకు దుప్పట్లు, చీరెలు పంపిణీ చేశారు. కేతవీరునిపాడు చర్చ్ పాస్టర్ బి.పరిశుద్ధరావు ఆధ్వర్యంలో ముఖ్య ప్రసంగీకులు రెవ. ఫాధర్ కింగ్ శ్రీను ముఖ్య అతిధిగా పాల్గొని వద్ధులు, వికలాంగులకు చీరెలు,దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నందిగామ బార్ అసోసియేషన్ అధ్యక్షులు కన్నెకంటి జీవరత్నం, పాస్టర్స్ ప్రకాశరావు, దేవ సహాయం, ఆనంద్, కేతవీరునిపాడు గ్రామ టిడిపి నాయకులు నెలకుదిటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.



పేదల అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత : కైలే

ప్రజాశక్తి-పమిడిముక్కల

రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం, అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ అన్నారు. పమిడిముక్కల మండలంలోని మంటాడ గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా కైలే అనిల్ కుమార్ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి బుక్‌లెట్లు అందజేశారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ నవరత్నాలు పథకాల ద్వారా సిఎం వైఎస్ జగన్ అన్ని తరగతుల ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారని వివరించారు. నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకం ద్వారా వైఎస్సార్ జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వీరమ్మ, కంబపు రాంబాబు, వైసిపి పమిడిముక్కల మండల అధ్యక్షులు యలమంచిలి గణేష్, పాతూరి చంద్రపాల్, శొంఠి వెంకటేశ్వరావు, మారుపాక మహేష్ పాల్గొన్నారు.



పథకాల బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే

తోలేటి శ్రీకాంత్ దంపతులకు సన్మానం

ప్రజాశక్తి - వన్‌టౌన్

ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ దంపతుల వివాహం సందర్భంగా సంఘ నాయకులు ఆదివారం ఘనంగా సత్కరించారు. విజయవాడ చిట్టినగర్ విశ్వబ్రాహ్మణ కళ్యాణ మంటపం నందు యార్రోజు రాజేశ్వరి అధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నిర్వహించిన విశ్వబ్రాహ్మణ వివాహ పరిచయ కార్యక్రమాన్ని తోలేటి శ్రీకాంత్ ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంఘీయులందరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని, అందరికీ శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు చైర్మన్ తోలేటి శ్రీకాంత్ వారి ధర్మపత్నిని న్యాయవాది కార్తీక సాయి దంపతులను వారి పెళ్లిరోజు సందర్భంగా ఘనంగా సత్కరించారు. అనం తరం తోలేటి శ్రీకాంత్ అన్నదానాన్ని ప్రారంభించారు.



తోలేటి శ్రీకాంత్ దంపతులను సత్కరిస్తున్న సంఘ నాయకులు

కృష్ణానదిలో కొట్టుకొచ్చిన శవం

ప్రజాశక్తి - భవానీపురం

భవానీపురం కృష్ణానది చేపల రేవు పక్కన ఓ గుర్తు తెలియని మగ శవం నీటిలో ఒడ్డుకు చేరుకున్న సంఘటనపై భవానీపురం, ఔట్ ఏజెన్సీ సచివాలయం వార్డు ప్రొటెక్షన్ సెక్రటరీ పడాల దుర్గాభవానీ భవానీపురం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు భవానీపురం చేపల రేవు పక్కన చందన బ్రదర్స్ వారి ఆరటి తోట దగ్గర కృష్ణానదిలో ఒడ్డుకు దగ్గరలో నీటిలో మగ వ్యక్తి చనిపోయి నీటిలో తేలుతూ కనిపించాడు. చుట్టుపక్కల వారి సమాచారం మేరకు సచివాలయ సెక్రటరీ వెళ్ళి చూడగా 30, 35 సంవత్సరాల వయస్సు కలిగి ఒంటిపై దుస్తులు లేకుండా అండర్‌వేర్‌తో ఉండి చనిపోయి శవం నీటిలో తేలుతూ బాడీ అంతా ఉబ్బిపోయి, ముఖం గుర్తు పట్టలేనంతగా ఉంది. చుట్టుపక్కల వారిని విచారించగా ఎలాంటి సమాచారం తెలియదన్నారు. దీంతో సెక్రటరీ ఇచ్చిన సమాచారం మేరకు భవానీపురం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు.

అనారోగ్యంతో మాజీ కార్పొరేటర్ కోరాడ రాము భార్య మృతి

- పలువురు నాయకుల సంతాపం

ప్రజాశక్తి-విజయవాడ

సిపిఎం మాజీ కార్పొరేటర్ కోరాడ రాము భార్య కస్తూరి (80) వయో భారం, అనారోగ్యంతో ఒక ప్రయివేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. వీరికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు. కుమారుడు కోరాడ విజయకుమార్ కూడా సిపిఎం మాజీ కార్పొరేటర్. ఈమె మృతి పట్ల పలువురు సంతాపం తెలిపారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చిగురుపాటి బాబూరావు, రాష్ట్ర కమిటీసభ్యులు వి ఉమామహేశ్వరరావు, జిల్లా కార్యదర్శి డివి కృష్ణ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, తూర్పు సిటీ కమిటీ కార్యదర్శివర్గసభ్యులు బత్తుల చిన్నారావు, స్థానిక పార్టీ నాయకులు కస్తూరి మృతదేహాన్ని సందర్శించి సంతాపం తెలిపి, ఆమె కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. కోరాడ రాము ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే.



మృతుని కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న దృశ్యం

మృతుడి కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - గంపలగూడెం

మండలంలో అనుములంక గ్రామానికి చెందిన గౌరసాని నాగిరెడ్డి ఇటీవల మృతి చెందిన విషయం తెలిసింది. మృతుని కుటుంబాన్ని ఆదివారం తిరువూరు మాజీ ఎమ్మెల్యే నల్లగట్ల స్వామి దాసు, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ నల్లగట్ల సుధారాణిలు పరామర్శించారు. మృతుని కుమారుడు ఆ గ్రామ మాజీ సర్పంచ్ రంగారెడ్డిని మృతికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు

అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

నియోజకవర్గంలోని పెనుగంచిప్రోలు గ్రామంలో వై.పి.ఆర్ గార్డెన్ లో ఉన్న మద్యం దుకాణంలో ఎక్సైజ్ అధికారుల తనిఖీలు చేసిన సమయంలో భారీగా అవకతవకలు జరిగాయని గుర్తించారని, ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన వారు ఎంతటి వారైనా ఉపేక్షించకుండా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి బొల్లా రామకష్ణ డిమాండ్ చేశారు. పట్టణంలో ఆదివారం విడుదల చేసిన ఒక పత్రిక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ ఒక్క షాపులో 32 లక్షల అక్రమాలకు పాల్పడితే జగ్గయ్యపేట నియోజకవర్గంలో 40 షాపులలో ఎంత అక్రమాలు జరిగాయో నిగ్గు తేల్చాలని అన్నారు.

రైతుల బాధలు పట్టవా? : వర్ల

ప్రజాశక్తి-పమిడిముక్కల

రాష్ట్రప్రభుత్వం తాజాగా తెచ్చిన నిబంధనలతో రైతులు ధాన్యం అమ్ముకోవడానికినానా ఇబ్బందులు పడుతున్నారని పామర్రు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి వర్ల కుమార్ రాజా విమర్శించారు. పమిడిముక్కల మండలంలోని మామిడిపల్లి శివారు గంధ్రపుగూడెంలో ఆదివారం జరిగిన బాదుడే బాదుడు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులు పండించిన పూర్తి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చిగురుపాటి కృష్ణారావు, పోలేం రామకృష్ణ, చంద్రయ్య, ఆలీ, జుజ్జువరపు అశోక్, మోటూరు వెంకటసుబ్బయ్య, రమణ, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.






పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

ప్రజాశక్తి-గూడూరు : గూడూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో పూర్వం పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా పాఠశాల 1981-82 బాచ్ పూర్వ విద్యార్థులు 40 సంవత్సరాల తర్వాత తర్వాత ఒకరినొకరు కలుసుకున్నారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన పూర్వ ఉపాధ్యాయులకు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రమణ బాబు, కరిముల్లా, బిరుదుగడ్డ శంకర్రావు, అంగడాల శ్రీనివాసరావు, మాగంటి రమణ, రాసంశెట్టి హిమ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.
ప్రజాశక్తి-పెడన : ముంజులూరు జెడ్ పి హై స్కూల్ పూర్వ విద్యార్థులు ఆదివారం నందమూరు లో కలిశారు. ఇందులో తొమ్మిది 1984 సంవత్సరం నుండి 87 సంవత్సరం పదో తరగతి వరకు కలిసి చదువుకున్న ముంజులూరు హైస్కూల్ విద్యార్థులు సుమారు 35 సంవత్సరాల తర్వాత నందమూరులో గెట్ టుగెదర్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గురువులను ఆహ్వానించి సత్కరించారు. ఆనాటి గురువుల ఆశీస్సులు పొందటం ఎంతో అదష్టంగా భావించామని ఆనందాన్ని తెలియపరిచారు. ఉత్తమ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన విఠల్ రావు, ముగ్గురు మాస్టార్లు పద్మనాభ రావు, సదాశివబ్రహ్మం, రాజేశ్వరరావు, జానకి శ్రీ రామ్ మూర్తి పాండురంగారావు ఉమాదేవి, సర్వేశ్వరరావు విచ్చేసి పూర్వవిద్యార్థులను ఆశీర్వదించారు.

పేర్ని నానికి సత్కారం

ప్రజాశక్తి-గుడివాడ : నూతన మున్సిపల్ కార్యాలయాన్ని మాజీ మంత్రి వైఎస్ఆర్సిపి కృష్ణాజిల్లా అధ్యక్షుడు, మచిలీపట్నం శాసనసభ్యులు పేర్ని వెంకటరమయ్య(నాని) శనివారం రాత్రి సదర్శంచారు. ఈ సందర్భంగా మున్సిపల్ మాజీ ప్రతిపక్షనేత చోరగుడి రవికాంత్ మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. అనంతరం చోరగుడి రవికాంత్ పేర్ని నానికి పలు మున్సిపల్ సమస్యలను తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పి.జె సంపత్ కుమార్ అసిస్టెంట్ కమిషనర్ రంగరావు, వైఎస్ఆర్సిపి నాయకుడు పాలడుగు రాంప్రసాద్ పాల్గొన్నారు.



కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి : సిఐటియు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు

స్కీమ్ వర్కర్స్ కు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని సీఐటీయూ గుడ్లవలేరు మండల కమిటీ తీర్మానించింది. స్థానిక రమా సహిత సత్యనారాయణ స్వామి మండపంలో ఆదివారం మండల సీఐటీయూ 3వ మండల మహాసభ జరిగింది. ఈ కార్యక్రమంలో మండల సిఐటియు నాయకులు పాల్గొన్నారు. వివిధ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగస్తులకు సరైన వేతనం అందక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని డివిజన్ సిఐటియు నాయకులు ఆర్సిపి రెడ్డి అన్నారు. కావున కనీస వేతనం 26 వేల రూపాయలు అందించాలని తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల బాధ్యులు బివి శ్రీనివాస్, సిఐటియు మండల అధ్యక్షురాలు చందన లక్ష్మి, కార్యదర్శి భాష, సహాయ కార్యదర్శి బి కోటేశ్వరరావు, ఉపాధ్యక్షురాలు రమాదేవి, కోశాధికారి గోపాలరావు, కమిటీ సభ్యులు అల్లాబక్షు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

ఎస్సీ సంక్షేమ సంఘం జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-కలెక్టరేట్(కృష్ణా)

ఏపీ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం కష్ణా జిల్లా అధ్యక్ష కార్యదర్సులుగా క్రా సునీల్, కుమార్, మద్దాల కృష్ణ కుమార్లు ఎన్నికయ్యారు. జిల్లా కమిటీ సర్వసభ్య సమావేశం ఆదివారం ఇనిస్టిట్యూట్ ఇంజనీర్స్ భవనం, విజయవాడలో జిల్లా అద్యక్షులు వై శ్యామ్ కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు నాగిసెట్టి ధర్మయ్య, స్టేట్ జనరల్ సెక్రెటరీ వెంకట్రావు ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. జిల్లాల పునర్విభజన నేపథ్యంలో కృష్ణా జిల్లాకు నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష కార్యద్ములు గా క్రా సునీల్ కుమార్,మద్దాల కృష్ణ కుమార్ లు,ఎన్నిక కాగా కోశాధికారి గా దాసి జయ ప్రకాష్ , వైస్ ప్రెసిడెంట్ గా తూము వెంకటేశ్వర రావు, చిన్నం వెంకట రమణ, ఈదా మేరీ , మెరుగు బాలాజీ లు, జాయింట్ సెక్రటరీలుగా దగాని కష్ణ, దాసి సుందర రావు, జ్యోతి బస్ లు ఎన్నికైనట్లు తెలిపారు.



మాట్లాడుతున్న మద్దాల కృష్ణకుమార్



జనసేన పార్టీలో చేరిక

ప్రజాశక్తి-గుడివాడ

స్థానిక 7వ వార్డు శ్రీరాంపురంకు చెందిన 30 మంది యువకులు జనసేన పార్టీలో చేరారు. ఆదివారం స్థానిక సత్యనారాయణ పురంలోని జనసేన పార్టీ కార్యాలయంలో పార్టీ ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ యువకులకు పార్టీ కండువాలు జనసేనలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడతూ రాష్ట్రంలో రాజకీయ శక్తిగా జనసేన పార్టీ ఆవిర్భవించిందన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో జనసేన ప్రభంజనాన్ని చాటి చెబుతామన్నారు.

రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ ఛాంపియన్‌షిప్‌కి ప్రత్యూష ఎంపిక

ప్రజాశక్తి-గన్నవరం



రాష్ట్రస్థాయి (అండర్19) స్కూల్ గేంస్ చాంపియన్ షిప్ పోటీలకు చైతన్య స్పోర్ట్స్ క్లబ్ క్రీడాకారిణి డి.నాగ ప్రత్యూష ఎంపికైనట్లు శిక్షకులు, స్పోర్ట్స్ క్లబ్ ప్రధానకార్యదర్శి దనాల నాగరాజు ఆదివారం పత్రికలకు తెలిపారు. ఈనెల 24 వతేదీన గన్నవరం ఆర్యవైశ్యకల్యాణ మండపంలో జరిగిన ఎంపికలలో డి. నాగప్రత్యూష తన అమోఘమైన క్రీడాప్రతిభ చూపటంతో ఆమెను సెలెక్షన్ కమిటీ జిల్లాజట్టుకు ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. విజయవాడ శ్రీచైతన్య కళాశాలలో బై.పి.సీ ద్వితీయ సంవత్సరం విద్యనభ్యసిస్తున్న ప్రత్యూష వచ్చేనెలలో కర్నూలు నందు జరగనున్న అంతర్ జిల్లాల అండర్ 19 విభాగంలో ఫెన్సింగ్ (కత్తిసాము) పోటీలకు కష్ణాజిల్లానుండి ప్రాతినిధ్యం వహిస్తారని నాగరాజు తెలిపారు. చిరంజీవి ప్రత్యూష ఎంపికపట్ల స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ డి.ఎస్.పి.మురళీకష్ణ, అధ్యక్షులు తిరివీధి వెంకయ్య, మరియు చైతన్య కళాశాల ప్రిన్సిపల్ మల్లిక రామకష్ణలు తమ శుభాభినందనలు తెలియచేశారు.

'మానవతా' సేవా సంస్థ కార్యక్రమాలు అభినందనీయం

ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్

మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని మచిలీపట్నం నగరపాలక సంస్థ హెల్త్ ఆఫీసర్, డా. వై బాలసుబ్రమణ్యం అన్నారు. పరసుపేట లోని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో ఆదివారం జరిగిన సేవా కార్యక్రమంలో డా. బాలసుబ్రమణ్యం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మచిలీపట్నం లేడీ అంప్తిల్ కళాశాల సెకండ్ ఇయర్ ఇంటర్ చదువుతున్న మహమ్మద్ గోరిమా కు విశ్రాంత ఎంఈఓ వెన్న వెంకటసుబ్బయ్య వెయ్యి రూపాయలు, పద్మావతి మహిళా జూనియర్ కళాశాల ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కుమారి రమా స్వేతకు రాంబాబు వెయ్యి రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. మానవతా మచిలీపట్నం శాఖ అధ్యక్షుడు, కానుకొలను ఫణి కిరణ్ అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో డా. బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ కోవిడ్ సమయంలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ మచిలీపట్నం పరిధిలో చేసిన సేవలు ఎనలేనివి అన్నారు.మతిచెందిన వారికి రెండు ఫ్రీజర్ బాక్సలు ఉచితంగా ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థకు సహాయ సహకారాలు అందజేస్తున్న డా. బాలసుబ్రమణ్యం, రిటైర్డ్ ఏఎస్ఐ సీతల ఆంజనేయులు గార్లను మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ తరఫున సత్కరించారు.ఈ కార్యక్ర ˆమంలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు, ఉల్లి రంగారావు, సాయిబాబు, రామ్మోహనరావు, పి వి ఫణి కుమార్, బాపూజీ, యార్లగడ్డ బాలసుబ్రమణ్యం, శీతాల ఆంజనేయులు, సుబ్బయ్య, తదితర మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.



నలుగురు బైక్ దొంగలు అరెస్ట్


- వారి నుండి గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-గన్నవరం

బైక్ దొంగతనాలు చేస్తున్న నలుగురు యువకులను ఆత్కూరు పోలీసులు శనివారం అరెస్ట్ చేసి వారి వద్ద నాలుగు బైకులు 400 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఉంగుటూరు మండలం ఆత్కూరు పోలీస్ స్టేషన్ లో డి.యస్.పి.విజయపాల్, జంక్షన్ సి.ఐ.నవీన్ నరసింహ మూర్తి, యస్.ఐ శేశుకుమార్ లు మీడియా సమావేశంలో నలుగురు ముద్దాయిలను మీడియా ముందు హాజరు పరిచారు. డి.యస్.పి విజయపాల్ మాట్లాడుతూ శనివారం ఉదయం 11 గంటలకు కృష్ణాజిల్లా ఉంగుటూరు మండలం తేలప్రోలు కోళ్ళఫారం దగ్గర డిఆర్ఆర్ ఓపెన్ ఫ్లాట్స్ ఏరియాలో నలుగురు వ్యక్తులు గంజాయిని కలిగి ఉన్నారన్న సమాచారంతో దాడి చేయగా నలుగురు యువకులు గంజాయి సేవిస్తూ పట్టుబడ్డారని వారి నుండి 395 గ్రాముల గంజాయి, మూడు సెల్ ఫోనులు,నాలుగు మోటార్ సైకిల్ లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నలుగురి బందంలోని ఇద్దరు వ్యక్తులు చత్తీస్ గడ్ రాష్ట్రం కుంట గ్రామం నుండి రెండు సార్లు గంజాయి తీసుకువచ్చి చిన్న చిన్న పొట్లాలు కట్టి చుట్టుప్రక్కల ఉన్న గ్రామాల్లో యువకులకు అమ్ముతూ వచ్చిన డబ్బులతో జల్సాలు చేస్తున్నారన్నారు. పట్టుబడిన నలుగురు యువకుల్లో ఇద్దరి పై పలు స్టేషన్ లలో కేసులు నమోదు అయినట్లు తెలిపారు. పట్టుబడిన నలుగురు ముద్దాయిలను కోర్టులో హాజరు పరచనున్నట్లు డి.యస్.పి.విజయపాల్ తెలిపారు.

ఎమ్మెల్యే అనుచరుల నుంచి రక్షణ కల్పించాలని ఫిర్యాదు

ప్రజాశక్తి-చల్లపల్లి



అవనిగడ్డ శాసన సభ్యులు సింహాద్రి రమేష్ బాబు అనుచరుల నుండి రక్షణ కల్పించాలని కోరుతూ ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్లో చల్లపల్లి సర్పంచ్ పైడి పాముల ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్పంచ్ గా ప్రశాంతంగా విధులు నిర్వహించేందుకు అవకాశం కల్పించాలని, వారి అనుచరుల నుండి కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రతినిధి కొల్లూరు వెంకటేశ్వరరావు, చల్లపల్లి మండల వైస్ ఎంపీపీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మోర్ల రాంబాబు. ఎంపీపీ కోట విజయ రాధిక సీనియర్ నాయకులు మోర్ల ప్రసాద్, ఎస్ సి జిల్లా ఆద్యక్షులు మాచవరపు ఆది నారాయణ తదితరులు పాల్గొన్నారు

సినీ నటులు కృష్ణ సంస్మరణ సభ

ప్రజాశక్తి-గుడివాడ

టౌన్‌వైడ్ సూపర్ స్టార్ కష్ణ, మహేష్‌బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొత్త మున్సిపల్ ఆఫీస్ సెంటర్లో సూపర్ స్టార్ కృష్ణ సంస్మరణ సభను ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైసిపి రాష్ట్ర నాయకులు దుక్కిపాటి శశిభూషణ్, చిరంజీవి యువత అధ్యక్షుడు కందుల రవి, బాలకష్ణ ఫ్యాన్స్ అధ్యక్షుడు రాజా, కృష్ణ, మహేష్‌బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శివాజీ, వల్లభనేని రవి, చంటి, కటారి రాంబాబు, అడుసుమిల్లి రాజేంద్రప్రసాద్‌లు కృష్ణా చిత్రపటానికి పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు చలన చిత్ర రంగంలో లెజెండ్ కృష్ణా మతి బాధాకరమన్నారు. సినీ రంగ అభివద్ధికి కష్ణా చేసిన సేవలను కొనియాడరు. అనంతరం వేల మందికి అభిమానుల ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు.


కృష్ణకు నివాళులర్పిస్తున్న దృశ్యం

వైసిపి ప్రభుత్వంలో బీసీలకు అన్యాయం



ప్రజాశక్తి-నందిగామ : తెలుగుదేశం ప్రభుత్వంలో చంద్రబాబునాయుడు బిసిలకు అమలు చేసిన సంక్షేమ పథకాలను మొత్తం రద్దుచేసి, రూ 34 వేల కోట్లు బీ.సీ నిధులను దారి మళ్లించారనీ నందిగామ మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు వీరంకి వీరాస్వామిన్ ప్రభుత్వాన్ని విమర్శించారు. బీసీలను మరొక సారి మోసం చేసేందుకు జగన్మోహన్ రెడ్డి వైసిపి బీసీ మంత్రులతో, బిసి నేతలతో సమావేశం జరిపి వారితో అబద్ధపు ప్రకటనలు చేయించారనీ వీరాస్వామిన్ ఆరోపించారు. అన్ని వర్గాలకు అమలు చేసిన పథకాలే బీసీలకు అందిస్తూ వాటిని ప్రత్యేక పథకాలుగా ప్రచారం చేస్తున్నారని వీరాస్వామిన్ తప్పుపట్టారు. ఆదరణ పథకం రద్దు చేశారనీ స్థానిక సంస్థల్లో 10 శాతం రిజర్వేషన్లు కొతకోసి సుమారు 16,800 మంది బిసిలను రాజ్యాంగబద్ధ పదవులను దూరం చేశారన్నారు. ఇప్పటికైనా దారి మళ్లించిన బీ.సీ సబ్ ప్లాన్ నిధులు వెంటనే విడుదల చేయాలనీ, రద్దు చేసిన బీసీ రిజర్వేషన్లు, ఆదరణ పథకాన్ని, వెంటనే పునరుద్ధించాలని వీరంకి వీరాస్వామిన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కంప చెట్లను తొలగించండి



ఏపుగా పెరిగిన కంపచెట్లు

ప్రజాశక్తి - గంపలగూడెం : మేడూరు నుండి గాదెవారుగూడెం వెళ్ళు పంచాయతీ రాజ్ రహదారికి ఇరువైపులా కంప చెట్లు వేపుగ (ఐదు కిలో మీటర్ల పొడవున) పెరగడంతో ఎదురెదురుగా వస్తున్న వాహనాలు కనిపించడం లేదని, దీంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వాహనదారులు అంటు న్నారు. ఇటీవల జరిగిన ప్రమాదాలలో కాళ్లు చేతులు విరిగాయి. రహదారికి ఇరువైపులా ఉన్న ఈ కంప చెట్లను తొలగిస్తే ఇటువంటి ప్రమాదాలు జరగవని పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు ఈ కంపచెట్లను తొలగించి జరుగుతున్న ప్రమాదాలను నివారించాలని కోరుతున్నారు. ఈ విషయమై స్థానిక పంచాయతీరాజ్ రేగళ్ల పూర్ణచంద్రరావు వివరణ కోరగా ఇటీవల ఆ పనులకై అంచనాలు తయారు చేసి పంపమని,(ప్రాజెక్టు ఇంప్లిమెంటేషన్ యూనిట్) రహదారి కంపచెట్లను తొలగించేందుకు నిధులు మంజూరు చేసినట్లయితే వెంటనే పనులు చేపడతామని తెలిపారు

కృష్ణకు ఘన నివాళి

ప్రజాశక్తి-కంచికచర్ల : సినీ నటుడు సూపర్ స్టార్ కృష్ణ సినీ రంగంలో అజేయుడని పలువురు కొనియాడారు. సూపర్ స్టార్ కృష్ణ సంతాప సభ కృష్ణ, మహేష్ బాబు అభిమాన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా, జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన శిబిరంలో ముందుగా పలువురు కషి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కృష్ణ జీవిత విశేషాలను తెలియజేస్తూ, కంచికచర్లలో కృష్ణ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని అభిమానులు ప్రకటించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కృష్ణ, మహేష్ బాబు అభిమాన సంఘం నాయకులు నంబూరు వెంకటబాబు, కొమ్మినేని శ్రీనివాసరావు, మన్నెం శ్రీనివాసరావు, దాసరి రాజా, వడ్డేల్లి సాంబశివరావు, నరసింహారావు, బివిఆర్, మస్తాన్, హుస్సేన్, రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.



కృష్ణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

వ్యకాస రాష్ట్ర మహాసభల జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి-మైలవరం : వచ్చే నెల డిసెంబర్ 8,9,10 తేదీలలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ఆ సంఘం నాయకులు పుల్లూరులో వాల్ పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం యన్టీఆర్ జిల్లా కార్యదర్శి కోట.కళ్యాణ్ మాట్లాడుతూ ఈ మహాసభలకు రాష్ట్రవ్యాప్తంగా 500 మంది ప్రతినిధులు హాజరవుతున్నారని, రైతాంగ పోరాటాలు భూ పోరాటాలు కూలి పోరాటాలు అనేక పోరాటాలకు నిర్వహించి నటువంటి ఉద్యమాలు చేసిన నాయకులు ఈ మహాసభల్లో పాల్గొంటున్నారన్నారు. భూ సమస్య పైన వివిధ రూపాలలో వ్యవసాయ కార్మిక సంఘం ఎన్టీఆర్ జిల్లాలోను మైలవరం ప్రాంతాల్లో అనేకమైన సమరశీల పోరాటాలు నిర్వహించిందని అన్నారు. సంపన్న వర్గాలు ఆక్రమించుకున్న అసైన్డ్ సీలింగు, ఫారెస్ట్ భూములపై వ్యవసాయ కార్మిక సంఘం నిరంతరం పోరాడుతుందని ఆయన అన్నారు. అంతేకాకుండా పేదల ఇళ్ల స్థలాల కోసం ఉపాధి హామీ చట్టం కోసం, కూలి పోరాటాలు నిర్వహించిందని ఆయన అన్నారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం సీనియర్ నాయకులు రావూరి రామారావు, కూలీ మేస్త్రి ఇంజమూరు.నాగమణి వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు లంకా. వెంకటేశ్వర్లు గురజాల. రామారావు భీమడోలు ముత్తయ్య బోడే. రామారావు, పత్తిపాటి.బాబూరావు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు తగదు : టిడిపి

ప్రజాశక్తి-జగ్గయ్యపేట ఉన్నత స్థాయిలో ఉన్న వ్యక్తులను ఉద్దేశించి మాట్లాడేటప్పుడు వైకాపా నాయకులు నోరు అదుపులో పెట్టుకోవాలని మాజీ శాసన సభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ హితవు పలికారు. తెదేపా అధినేత చంద్రబాబు నాయుడుపై రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి సోదరుడు వైకాపా నాయకుడు తోపుదుర్తి చంద్రశేఖర్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. పట్టణంలోని ఆయన నివాసంలో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ వైకాపా నాయకులు తప్పుచేసి అందరిపై చిందులు తొక్కుతున్నారని మండి పడ్డారు. చంద్రబాబు నాయుడుపై చేసిన అనుచిత వ్యాఖ్యలతోనే వారి నేర చరిత్ర బయటపడిందని ఆరోపించారు. ప్రభుత్వంపై తప్పులు చూపిస్తూ సోషల్ మీడియాలో చిన్న చిన్న కామెంట్ పెడితేనే అరెస్టులు చేసి ఇబ్బందులు గురిచేస్తున్న ప్రభుత్వం, తెదేపా అధినేత చంద్రబాబు నాయుడుని చంపుతామని బెదిరించిన, రాయలసీమ ప్రాంతంలో ఎటువంటి హత్య రాజకీయాలు జరిగిన అది మొదట లోకేష్ తోనే మొదలవుతుందన్న వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. చంద్రబాబు నాయుడుకి, లోకేష్ కి ప్రజల్లో వస్తున్నటువంటి ప్రజాదరణ చూసి ఓర్వలేక ఇటువంటి రెచ్చగొట్టే మాటలు మాట్లాడుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఎమ్మెల్యే తమ్ముడుపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో రానున్న రోజులలో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నూకల కుమార్ రాజా, పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి మైనేని రాధాకష్ణ, మున్సిపల్ కౌన్సిలర్లు పేరం సైదేశ్వరరావు, నకిరికంటి వెంకటి, ఇర్రి నరసింహారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి -నందిగామ : నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ పై తోపుదుర్తి చంద్రశేఖర్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖలను మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఖండించారు. తోపుదుర్తి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడిన మాటలు సమసిపోయినా ఫ్యాక్షన్ రాజకీయాలను నిద్రలేపినట్లుగా ఉందన్నారు. ఎన్టీఆర్ జిల్లా నందిగామ నియోజకవర్గం, కర్నూల్ జిల్లా పత్తికొండ, ఆదోని, ఎమ్మిగనూర లో నారా చంద్రబాబు నాయుడుకి వచ్చిన జనాదరణ చూసి వైసిపి నాయకలు మతి భ్రమించి ఇలాంటి రెచ్చగొట్టే రాజకీయాలకు పాల్పడుతున్నారు. తోపుదుర్తి చంద్రశేఖర్ రెడ్డిని తక్షణమే అరెస్ట్ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-విసన్నపేట : స్థానిక విస్సన్నపేటలో ఎస్ఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా 49వ మహాసభలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్ మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్లో విద్యా రంగానికి ఎక్కువ నిధులు కేటాయించాలని, సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మొటిక్స్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. అర్హులైన విద్యార్థులందరికీ విద్యా సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వి.నాగరాజు, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎన్. నాగేశ్వరావు మాట్లాడుతూ విద్యార్థులు తమ సమస్యలపై ఐక్యంగా పోరాడాలని కోరారు. కళాశాలలో స్థానిక సమస్యలపై పోరాడి కృషి చేయాలని కోరారు. వీటితోపాటు సమాజం పట్ల బాధ్యతగా విద్యార్థులు వ్యవహరించాలని తమ హక్కుల కోసం పోరాడాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యా విధానం పేరుతో విద్యారంగాన్ని మొత్తం ప్రైవేటీకరణ చేయటం తగదని కోరారు. ఎస్ఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు ఎం.సోమేశ్వరరావు, ఎస్ఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి సి.హెచ్. వెంకటేశ్వరరావు, ఎస్ఎఫ్ఐ ఏలూరు జిల్లా అధ్యక్షులు కె.లెనిన్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు జి.గోపి నాయక్, ప్రణీత, ఎం.కుమార్ నాయక్, ఎస్ఎఫ్ఐ విసన్నపేట మండల కార్యదర్శి ఎం.సునీల్ కెవిపిఎస్ జిల్లా నాయకులు జ్ఞానరత్నం, ఐద్వా ,ధనలక్ష్మి రంగారాణి పాల్గొన్నారు.

బోరుకు మరమ్మతులు

ప్రజాశక్తి కంచికచర్ల : కంచికచర్ల మండలం పరిటాల గ్రామంలో శ్మశాన వాటికలో బోరు పంపుకు టిడిపి నాయకులు సొంత నిధులతో మరమ్మతులు చేయించారు. గత కొంతకాలంగా పరిటాల శ్మశానం ప్రాగణంలో బోరు పనిచేయటం లేదు. దీంతో కర్మ కాండలకు వచ్చిన వారు నీటి సౌకర్యం లేక ఇబ్బందులు పడ్డారు. ఈ విషయం పైఅధికారుల దష్టికి ఎన్నీ సార్లు తీసుకువచ్చినా పట్టించుకోలేదని గ్రామస్తులు వాపోయారు. దీంతో ఆదివారం టిడిపి కి చెందిన మాజీ ఎంపిటిసి మాగంటి చిన్న పుల్లారావు , మాజీ సర్పంచ్ మాగంటి నరసింహారావు (బాబు) పరిటాల వార్డు మెంబర్ దామినేని భాస్కర్, గణపనేని సాంబశివరావు బోరుకు మరమ్మతులు చేయించారు.

మిర్చి రైతులను ఆదుకోవాలి : రైతు సంఘం

ప్రజాశక్తి - గంపలగూడెం : మండలంలోని మిర్చి రైతులు గత ఏడాదిలోలాగా నష్టపోక ముందే ప్రభుత్వ అధికారులు సలహాలు సూచనలు ఇవ్వాలని ఎన్టీఆర్ జిల్లా రైతు సంఘం కార్యదర్శి పివి ఆంజనేయులు కోరారు. ఆదివారం ఆయన గంపలగూడెం మండలం పెనుగొలను, దుందిరాలపాడు, ఊటుకూరు, తునికిపాడు తదితర గ్రామాలలో మిర్చి పంటలను పరిశీలించారు. మిర్చి పంటలో తామర పురుగు ఆశిస్తున్నట్లు గమనించినట్లు తెలిపారు. ఇటువంటి విషయాలపై గత ఏడాది రైతులు తీవ్రంగా నష్టపోయిన విషయం ఆంజనేయులు గుర్తు చేశారు. ప్రస్తుతం ప్రభుత్వ శాస్త్రవేత్తలు పంట పొలాలను పరిశీలించి, రైతులకు తగిన జాగ్రత్తలు సూచనలు చేయాలని, తగిన సమయంలో ఏ మందు ఎలా వాడాలో తెలియజేసినట్లయితే రైతులు జాగ్రత్త పడే అవకాశం ఉందని వివరించారు. మండలంలోని హార్టికల్చర్, అగ్రికల్చరల్ వ్యవసాయ అధికారులు సంయుక్తంగా రైతులకు తగిన సలహాలు ఇవ్వాలని కోరారు. గ్రామస్థాయిలో ఉన్న ఆర్బికేల ఉద్యోగులైన ఎంపీఈవోలు క్షేత్రస్థాయిలో మిర్చి చేలను పరిశీలించి తగిన సలహాలు రైతులకు తెలియజేయాలన్నారు. జిల్లా కౌలు రైతుల సంఘం అధ్యక్షులు గువ్వల సీతారామిరెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టారని, పంట చేతికి వస్తుందన్న సమయం ఆసన్నమైందని ఇప్పుడే రైతులు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ సత్యం బాబు, ఎం జె చారి, మహిళా సంఘం నాయకురాలు తేళ్లూరు శాంతకుమారి, దేవర నాగార్జున, వి ఆంజనేయులు, పి పుల్లారావు, జయరాజు పాల్గొన్నారు



మిర్చి పంటను పరిశీలిస్తున్న నాయకులు

ప్రజాశక్తి
జిల్లా వార్తలు 5
సోమవారం 28 నవంబర్ 2022

ఎన్‌సీసీ క్యాడెట్ల సేవలు అభినందనీయం

భారత రక్షణ మంత్రిత్వ శాఖ కార్యదర్శి గిరిధర్ అరమణే

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్

ప్రజల్లో క్రమశిక్షణ, దేశభక్తి స్ఫూర్తిని నింపడంతో పాటు సమాజ సేవకు కృషి చేస్తున్న ఎన్ సీ సీ క్యాడెట్ల సేవలు అభినందనీయమని భారత రక్షణ మంత్రిత్వ శాఖ కార్యదర్శి గిరిధర్ అరమణే అన్నారు. ఎన్‌సిసి 75 వ వార్షికోత్సవం పురస్కరించుకొని మచిలీపట్నం 16 ఏపి బెటాలియన్ ఎన్‌సిసి ఆధ్వర్యంలో శనివారం మంగినపూడి బీచ్‌లో ఏర్పాటుచేసిన పునీత్ సాగర్ అభియాన్ కార్యక్రమంలో ఆయన జిల్లా కలెక్టర్



పి.రంజిత్ బాషా, జిల్లా ఎస్పీ పి.జాషువా లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సముద్రాలు, నదులు వద్ద పేరుకుపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాల నిషేధంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ కాలుష్య రహిత సమాజానికి ఎన్ సిసి క్యాడెట్లు ఎంతో కృషి చేస్తున్నారని కొనియాడారు. ముందుగా ప్లాస్టిక్ నిషేధంపై విద్యార్థులు ప్రదర్శించిన లఘునాటికను ఆయన తిలకించారు. గతంలో కాకినాడ, రాజమండ్రి సముద్ర తీర ప్రాంతాలలో ప్లాస్టిక్ వ్యర్థాలను శుభ్రపరచిన ఫోటో గ్యాలరీని తిలకించారు. 19 ప్రదేశాలలో 100 టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించగా 60 టన్నులను రీసైక్లింగ్ చేసినట్లు ఆయనకు అధికారులు వివరించారు. ఎన్సీసీ క్యాడెట్లతో ముచ్చటించారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ భారత రక్షణ మంత్రిత్వ శాఖ కార్యదర్శి గిరిధర్ అర్మానే ని దుశాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ డైరెక్టరేట్ వీఎం, డిడిజి పి.మహేశ్వర్, 16 ఏపీ బెటాలియన్ ఎన్సిసి కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ సన్నార్ సింగ్, డిఆర్‌ఓ ఎం.వెంకటేశ్వర్లు, బందరు ఆర్డీఓ ఐ.కిషోర్, బందరు డిఎస్పి మాసుం బాషా, స్పెషల్ బ్రాంచ్ డి.ఎస్.పి భరత్ మాతాజీ, బందరు తాసిల్దార్ డి.సునీల్ బాబు, ఇతర అధికారులు, ఎన్సిసి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పెయింటింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్

మచిలీపట్నం పెయింటింగ్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడిగా మంచాల ఏసుదాస్(దాస్ ఆర్ట్స్), నూతన అధ్యక్షునిగా తిరుమని తారకరామ్(శ్రీరామ్ ఆర్ట్స్), ప్రధాన కార్యదర్శిగా పెదసింగు సార్వభౌమరావు (పవనజ బాబ్జీ) ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక జగన్నాథపురంలో జరిగిన కార్యక్రమంలో సంఘం లీగల్ అడ్వయిజర్ లంకిశెట్టి బాలాజీ అసోసియేషన్ నూతన లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ అన్ని కళల్లో చిత్రకళ స్థానం ఉన్నతమైనదన్నారు. రవివర్మ చిత్రాలు, బాపు చిత్రాలు తరతరాలకు తరగని మన ఆస్తి అని అన్నారు. మారుతున్న టెక్నాలజీతో జీవన భృతి కోల్పోతున్న పెయింటింగ్ ఆర్టిస్టులను ఆదుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రభుత్వ ప్రకటనలు, ప్రభుత్వ ప్రచారాల్లో పెయింటింగ్ ఆర్టిస్టులకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కరోనా సమయంలో పెయింటింగ్ ఆర్టిస్టులు చేసిన సేవలు మరువలేనివన్నారు. మచిలీపట్నం పెయింటింగ్ ఆర్టిస్ట అసోసియేషన్ వారికి ప్రభుత్వ పరంగా పక్కా ఇల్లు నిర్మించి ఇవ్వాలని, ప్రభుత్వపరంగా బ్యాంకు రుణాలు మంజూరు చేయాలని బాలాజీ జిల్లా కలెక్టర్‌కి విజ్ఞప్తి చేశారు. అసోసియేషన్‌కి పూర్వ అధ్యక్షుడు మస్తాన్‌రావు రూ.5,000 ఆర్థిక సహాయాన్ని అందించారు. నూతన కార్యవర్గం ఉపాధ్యక్షులుగా శీరంశెట్టి రాజేష్ బాబు, కోశాధికారిగా కె.ఎల్. ఎస్. కుమార్, సంయుక్త కార్యదర్శిగా మట్టా బాల భాస్కర్ మరో 9 మంది కార్యవర్గ సభ్యులు పదవి బాధ్యతలు స్వీకరించారు. నూతన కార్యవర్గానికి పలువురు అభినందనలు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న విద్యాసాగర్

సంఘటిత పోరాటాలతోనే విజయం : విద్యాసాగర్

ప్రజాశక్తి-గన్నవరం

గన్నవరం తాలూకాలో సంఘాన్ని బలోపేతం చేసేందుకు నూతన నాయకత్వం కంకణబద్ధులు కావాలని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఏ. విద్యాసాగర్ అన్నారు. ఆదివారం గన్నవరం ఎన్జీవో కార్యాలయంలో తాలూకా గన్నవరం యూనిట్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎన్జీవో పోరాటాలకు పురిటిగడ్డ గన్నవరం అన్నారు. తనకు తెలిసి ఐదేళ్ల క్రితం వరకు ఈ ప్రాంతంలో ఎన్జీవోలు బలమైన ఉద్యమాలు చేశారని గుర్తు చేశారు. సంఘటితంగా ఉండబట్టే అది సాధ్యమైందన్నారు. ప్రస్తుతం సంఘం బలహీనపడుతోందని దానిని బలోపేతం చేసేందుకు నూతన నాయకత్వం ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో పిఆర్‌సి, డిఎ పెండింగ్ మొత్తాలు విడుదల చేయటం లేదన్నారు. ఇంకా అనేక సమస్యలు ప్రభుత్వం వద్ద పెండింగ్లో ఉన్నాయని అవి పరిష్కారం కావాలంటే సంఘటిత పోరాటాలకు సిద్ధమవ్వాల్సిన అవసరం మన ముందు ఉందన్నారు. గన్నవరంలోని సంఘ కార్యాలయాన్ని ఎప్పుడూ తెరిచి ఉంచాలని, ఉద్యోగులకు ఏదైనా సమస్య వస్తే ఆఫీసుకు వచ్చి చెప్పుకునే పరిస్థితి ఉండాలన్నారు. ఎన్జీవోలకు సమాధానం చెప్పాల్సింది సంఘ నాయకులే అన్నారు. సంఘ కార్యాలయంలో నాయకులు ఎప్పుడు అందుబాటులో ఉండాలన్నారు. గన్నవరం కమిటీ బాగా పని చేయాలని,నూజివీడు కమిటీ జిల్లాలో నెంబర్ వన్ స్థానంలో ఉందని ఆ స్థాయికి గన్నవరం కమిటీ వెళ్లాలని సూచించారు. అనంతరం గన్నవరం తాలూకా యూనిట్ కు అధ్యక్షులుగా ఎన్నికైన వి. సాంబశివరావు, కార్యదర్శి వి. వంశీ, కోశాధికారి ఎం. రవి, సంయుక్త కార్యదర్శిగా సూర్య కళ, ఉపాధ్యక్షులుగా సునీల్ కుమార్, శ్రీనివాస్, సురేందర్, నాంచారయ్య, మరో పది మందికి బాధ్యతలు అప్పగించారు. ఈ కార్యక్రమంలో ఎన్జీవో సంఘం నాయకులు డాక్టర్ రామ కష్ణ, సిబటియు మండల అధ్యక్షులు మహేష్, ఎన్జీవో సంఘం జిల్లా కార్యదర్శి ఇక్బాల్, ఎన్నికల అధికారి రాజబాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూతన కార్యవర్గానికి ఎన్నికైన నాయకులను సన్మానించారు.

ఎపిడబ్ల్యుజెఎఫ్ సేవలు స్ఫూర్తి దాయకం

ప్రముఖ గుండె వైద్య నిపుణులు పల్లెం పెద్దేశ్వరరావు

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్

పేద ప్రజలకు ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఏపిడబ్ల్యుజెఎఫ్) మచిలీపట్నం కమిటీ అందిస్తున్న సేవలు స్ఫూర్తిగా నిలుస్తున్నాయని ప్రముఖ గుండె వైద్య నిపుణులు పల్లెం పెద్దేశ్వరరావు అన్నారు. స్థానిక హిందూ కాలేజీలో ఆదివారం జరిగిన మెగా మెడికల్ క్యాంపులో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జర్నలిస్టుల సంక్షేమంతో పాటు మానవ సేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్న ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఏపిడబ్ల్యుజెఎఫ్) మచిలీపట్నం శాఖ ప్రతినిధులను అభినందించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ మచిలీపట్నం, పెద్దేశ్వర్ హార్ట్ కేర్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో హిందూ కాలేజీలో నిర్వహించిన మెగా మెడికల్ క్యాంపుకు పరీక్షల నిమిత్తం వచ్చిన వారికి ఏపిడబ్ల్యుజెఎఫ్ ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ పల్లెం పెద్దేశ్వరరావు, మాజీ పార్లమెంట్ సభ్యులు కొనకళ్ల నారాయణరావు, వైసీపీ యువ నాయకుడు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), లయన్స్ క్లబ్ జిల్లా కో-ఆర్డినేటర్ లంకిశెట్టి బాలాజీ, మచిలీపట్నం అధ్యక్షులు పుప్పాల ప్రసాద్, కార్యదర్శి పంచపర్వాల ప్రభాకర్ తదితరులు మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని సందర్శించి మజ్జిగను పంపిణీ చేశారు. ఇటీవలి కాలంలో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న జర్నలిస్ట్ ఫెడరేషన్ కార్యవర్గ సభ్యుల్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు డిఎస్ ఆర్ వికె ప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శి కొడాలి శ్రీను, మచిలీపట్నం శాఖ గౌరవ అధ్యక్షులు కొల్లూరి జాకబ్, అధ్యక్షులు మహ్మద్ కౌసర్, కార్యదర్శి షేక్ షరీఫ్, ఉపాధ్యక్షులు సోబిల శశిభూషణరావు, కోశాధికారి సామా సునీల్, సభ్యులు ఎం ఫణిమాధవ్, పి ఫణి, వి సాయి, విజయ కుమారి తదితరులు పాల్గొన్నారు.


మజ్జిగ పంపిణీ చేస్తున్న ఎపిడబ్ల్యుజెఎఫ్ నాయకులు

అవసరమైతే తిరగబడాలి : టిడిపి

ప్రజాశక్తి-గన్నవరం

వైసీపీ దురాగతాలపై తిరగబడాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి దొంతు చిన్న కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆదివారం గన్నవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మండల తెలుగుదేశం పార్టీ సర్వసభ్య సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దొంతు చిన్నా మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ఆదేశాలు మేరకు చేపట్టిన బాదుడే




బాదుడు, రాష్ట్రానికి ఇదేమి కర్మ అనే కార్యక్రమం ముఖ్య ఉద్దేశం జనాల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకి దిశానిర్దేశం చేశారు. వైయస్సార్ సిపి నాయకులు చేస్తున్న ఆగడాలను ఎత్తిచూపాలని కార్యకర్తలకు చెప్పారు. ఈ రాష్ట్రం బాగుపడాలంటే మళ్లీ చంద్రబాబు గారిని సీఎం గా గెలిపించుకోవాల్సిన అవసరం ఈ రాష్ట్ర ప్రజలకు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు జస్తి వెంకటేశ్వరరావు, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ.10వేలు ఆర్థిక సహాయం

ప్రజాశక్తి-కోడూరు

కోడూరు మండల పరిధిలోని విశ్వనాథపల్లి గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఖాతాదారులైన సనకా నాగ సుబ్బారావు ఇటీవల మృతిచెందారు. మట్టి ఖర్చుల నిమిత్తం సుబ్బారావు కుటుంబ సభ్యులకు రూ.10 వేల ం ా ా ు ్ ు ు విశ్వనాథపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం తరుపున సంఘ చైర్ పర్సన్ తోట



వెంకట నాంచారమ్మ, సీఈవో చుండూరు రమేష్ ఆదివారం ఆ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ తోట వెంకట నాంచారమ్మ మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు రైతులకు పంట సాగు విషయంలోనే కాక రైతులు ఇబ్బందులు పడుతున్న తరుణంలో కూడా వారి కుటుంబాలకు చేదోడు వాదోడుగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వనాథపల్లి గ్రామ ప్రముఖులు తోట వెంకట దామోదరరావు, కొండవీటి నాగ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

విషజ్వరాలు నివారణకు చర్యలు చేపట్టాలి: ఐద్వా

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్

డెంగ్యూ, విషజ్వరాలు నివారణకై అధికారులు చర్యలు చేపట్టాలని ఐద్వా జిల్లా కార్యదర్శి వి జ్యోతి కోరారు. ఐద్వా మచిలీపట్నం నగర కమిటీ ఆధ్వర్యంలో శనివారం మున్సిపల్ అధికారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్రైనేజీల్లో సిల్ట్ తీయకపోవడం వలన విషపు పురుగులు, దోమలు విపరీతంగా పెరిగి డెంగ్యూ, వైరల్ మలేరియా జ్వరాలు ప్రబలుతున్నాయన్నారు. ప్రభుత్వ వైద్యశాలల్లో మందులు టెస్టులు అందుబాటులో లేకపోవడంతో ప్రైవేట్ ఆసుపత్రుల్లో అధికంగా డబ్బులు వెచ్చించి వైద్యం చేయించాల్సి వస్తోందన్నారు. పట్టణ కార్యదర్శి కే.సుజాత మాట్లాడుతూ న్యాయమైన బ్లీచింగును చల్లాలని, డ్రైనేజీ సిల్టును తొలగించాలని డిమాండ్ చేశారు. ఐద్వా పట్టణ కోశాధికారి పి.లక్ష్మి మాట్లాడుతూ కార్పొరేషన్ జనాభాకి తగ్గట్టుగా శానిటరీ వర్కర్లను పెంచాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో టౌన్ నాయకులు టి చాందిని పాల్గొన్నారు.

'పూర్తి ధాన్యాన్ని కొనుగోలు చేయాలి'

ప్రజాశక్తి-చల్లపల్లి

రైతులు పండించిన ధాన్యాన్ని రైతుభరోసా కేంద్రాల ద్వారా రాష్ట్రప్రభుత్వం కొనుగోలు చేయాలని ఎపి కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శీలం నారాయణరావు ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని 26 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తామనే నిబంధనని తొలగించాలి అన్నారు. రైతు పండించిన పంటను నేరుగా రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ధాన్యం తేమ శాతాన్ని రైతు భరోసా కేంద్రాలలో నిర్ణయించాలన్నారు. ధాన్యం తేమ శాతాన్ని సంబంధిత మిల్లర్లకు రైతు భరోసా కేంద్రాల ద్వారా పంపాలన్నారు రైతు భరోసా కేంద్రంలో నిర్ణయించిన ధరకే ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

ఇళ్లు తొలగించకుండా రిటైనింగ్ వాల్ నిర్మించాలి : సిపిఎం



ప్రజాశక్తి-విజయవాడ: రక్షణ గోడ నిర్మాణం పేరుతో ఇళ్లను తొలగించినట్లయితే ప్రజాగ్రహానికి గురికావాల్సి వస్తోందని సిపిఎం రాష్ట్ర కమిటీసభ్యులు దోనేపూడి కాశీనాథ్ హెచ్చరించారు. కృష్ణలంక 21వ డివిజన్ పద్మావతి ఘాట్ నుంచి వారధి వరకు వరద ముంపు నివారణకు రక్షణ గోడ నిర్మాణంలో ఇళ్లను తొలగించరాదని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో బృందం రణదివెనగర్ కరకట్ట ప్రాంతంలో ఆదివారం పర్యటించింది. రిటైనింగ్ వాల్ నిర్మాణం జరుగుతున్న ప్రాంతంతో పాటు కరకట్ట నివాసులను కలిసి, వారు వ్యక్తం చేస్తున్న అభిప్రాయాన్ని సిపిఎం బృందం సేకరించింది. ఎటువంటి సమాచారం ఇవ్వకుండానే ఇళ్లను తొలగిస్తామంటూ అధికారులు నోటీసులు ఇస్తున్నారని, తమ ఇళ్లకు రక్షణగా రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపడతామని చెప్పిన ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రస్తుతం ఇళ్లను తొలగించే ప్రయత్నం జరుగుతుందని ఆందోళనతో ప్రజలు సిపిఎం బృందానికి తెలిపారు. ఇక్కడ నుంచి బయటకు పంపిస్తే తమకు ఉండటానికి గూడు కూడా ఉండదని,అంతేగాక ఉపాధి దెబ్బతింటుందని, తమ ప్రాణాలు పోయినా ఇక్కడ నుంచి కదిలేది లేదని నాయకులకు స్థానిక నివాసులు వ్యక్తం చేశారు. దీనిపై కాశీనాథ్ మాట్లాడుతూ రక్షణ గోడ నిర్మాణం పేరుతో పేదల గృహాలను తొలగించడానికి పూనుకుంటే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. రక్షణ గోడ నిర్మాణంతో పాటు ఇళ్లకు పట్టాలు మంజూరు చేస్తామని గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు, ఏ ఒక్క ఇంటిని కూడా తొలగించకుండా రిటైనింగ్ వాల్‌ను నిర్మించాలని డిమాండ్ చేశారు. రిటైనింగ్ వాల్ నిర్మాణం ఎక్కడ నుంచి నిర్మిస్తుంది తదితర అంశాలను స్థానిక ప్రజలకు సమగ్రంగా చెప్పాలని, అలాగే రాజకీయపక్షాలతో అధికారులు సమావేశం నిర్వహించి చర్చించి, ఇక్కడ జరుగుతున్న నిర్మాణ పనులను వెల్లడించాలని కోరారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో జరుగుతున్న స్పందన కార్యక్రమంలో ఇళ్లను తొలగించవద్దని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వడం జరుగుతుందని, దీనిలో స్థానిక నివాసులందరూ పాల్గొంటారని తెలిపారు. అనేక వరదలు సంభవించినా కష్ట-నష్టాలకోర్చి, సర్వం కోల్పోయినా గత నాలుగైదు దశాబ్దాల నుంచి రణదివెనగర్ వాసులు ఇక్కడే నివాసముంటున్నారని అన్నారు. రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపట్టాలని సిపిఎం అనేక పోరాటాలు చేసిన ఫలితంగా వాల్ నిర్మాణానికి ప్రభుత్వం మంజూరు చేయడం మంచి పరిణామమన్నారు. ఇప్పటికయినా ఇళ్లను తొలగించకుండా రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపట్టాలని లేనట్లయితే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి వర్గ సభ్యులు పుప్పాల కష్ణ, నాయకులు కోరాడ రమణ, లక్ష్మీనారాయణ, శివాజీ, లక్ష్మణ్ కుమార్ ,వెంకన్న, మీరాభి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సిసి శిక్షణతో ఉజ్వల భవిష్యత్తు

ప్రజాశక్తి-వన్‌టౌన్: ఎన్‌సిసి శిక్షణ పొందటం ద్వారా అత్యుత్తమ భవితను పొందేందుకు అవకాశముంటుందని కాకరపర్తి



భావనారాయణ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీ. నారాయణరావు అన్నారు. ఆ కళాశాల ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో ఎన్‌సీసీ దినోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ నారాయణరావు మాట్లాడుతూ దేశభక్తి భావాలను పెంపొందించుకుంటూ విద్యార్థులు తమను తాము ఉత్తమంగా ఆవిష్కరించుకునేందుకు ఎన్‌సీసీ ముఖ్యభూమికను పోషిస్తుందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, నాయకత్వ పటిమను తీర్చిదిద్దటానికి ఎన్‌సీసీ ముఖ్య సాధనంగా ఉందన్నారు. విద్యార్థి దశలో ఎన్‌సీసీ శిక్షణ వారిని క్రమశిక్షణతో పాటుగా జీవితాంతం ఉత్తమ నడవడికతో ముందుకు సాగే విధంగా తీర్చిదిద్దుతయాన్నారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ఎన్‌సీసీ ఆఫీసర్ కెప్టెన్ కేపీటీ విజయభాస్కర్ మాట్లాడుతూ తమ కళాశాలలో సుదీర్ఘ కాలంగా ఎన్‌సీసీ విభాగం విద్యార్థులను అత్యుత్తమంగా తీర్చిదిద్దటానికి అండగా ఉంటుందన్నారు. తమ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు ఆర్‌డీ క్యాంప్‌కు ఎంపికై తమ ప్రతిభను ప్రదర్శించటం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులకు మంచి ఉపాధి అవకాశాలను అందించే ఎన్‌సీసీలో అందరూ చేరాలన్నారు.

తల్లి చెంతకు బాలుడు

ప్రజాశక్తి-వన్‌టౌన్: తప్పిపోయిన మూడేళ్ల బాలుడు పోలీసుల సహాయంతో గంటల వ్యవధిలోనే తల్లి చెంతుకు చేరుకున్నాడు. చిట్టినగర్ సెంటర్‌కి చెందిన బాలుడు తమ్మిన నోరిన్ ఆదివారం మధ్యాహ్నం తప్పిపోయాడు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా అతని ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో బాలుని తాతయ్య విఏఎన్ పాత్రుడు కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొత్తపేట ఇంచార్జ్ సిఐ సురేష్‌రెడ్డి, జనరల్ డ్యూటీ హెడ్ కానిస్టేబుల్ మొగిలి బాలాజీ తన సిబ్బందితో గాలింపు చర్యలు చేపట్టారు. తప్పిపోయిన నోరిన్ తన ఇంటికి కూతవేటు దూరంలో వున్న రామచంద్రరావు మటన్, బిర్యానీ షాపు యజమాని శ్యామ్‌రాజ్ షాపు ముందు ఏడుస్తూ నిలబడ్డాడు. దీంతో శ్యామ్‌రాజ్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు.

జైనుల ఉపవాస దీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి-వన్‌టౌన్: గొల్లపూడి జైన్ కాలనీ వద్ద ఆదివారం జైనుల 45 రోజుల ఉపవాస దీక్షలు లాంఛనంగా ప్రారంభించారు. శ్రీ సంభవనాథ్ రాజేంద్ర సురి జైన్ శ్వేతాంభర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ఉపవాస దీక్షల్లో ఆదివారం 150 మంది జైనులు దీక్షలు చేపట్టారు. దీక్షలు చేపట్టే వారి కోసం ట్రస్ట్ ఆధ్వర్యంలో భారీ బడ్జెట్‌తో తాత్కాలిక ఆలయాన్ని నిర్మించారు. ఈ నెల 27 నుండి ప్రారంభమైన దీక్షలు 2023 జనవరి 15 వరకు కొనసాగుతాయని ట్రస్ట్ అధ్యక్షులు రాజు సోలంకి తెలిపారు. ఈ కార్యక్రమాలకు ట్రస్ట్ కార్యదర్శి నరేంద్ర రాథోడ్, కన్వీనర్ మొహన్‌లాల్ కొఠారి, గోల్డ్ మెడల్ అధినేత ప్రవీణ్, రిక్కా చంద్, దళపతి చంద్, ఇంద్రమల్, ప్రవీణ్‌కుమార్ సేవలందిస్తున్నట్లు తెలిపారు.

రేపు ఏపీ ఎన్జీవో నగర సమావేశం

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: ఈ నెల 29 వ తేదీ న జరిగే ఏపీ ఎన్జీవో అసోసియోషన్ నగర శాఖ సర్వసభ్య సమావేశాన్ని ఏపీ ఎన్జీవో నగర శాఖ అధ్యక్ష కార్యదర్శులు జే స్వామి, సంపత్ కుమార్ కోరారు. ఎపి ఎన్ జివో అసోసియోషన్ నగర శాఖ కు 2019 నిర్వహించిన ఎన్నికలలో ప్రస్తుత కార్యవర్గ సబ్యులు ఏక గ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. కార్యవర్గ కాల పరిమితి మూడు సంవత్సరాల కాలం పూర్తయినందున తిరిగి నూతన కారవర్గాన్ని ఎన్నుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 29వ తేదీ మంగళవారం సాయంత్రం ఆరు గంటలకు నగరంలోని గాంధినగర్ నందు గల ఏపీ ఎన్జీవో అసోసియేషన్ భవనంలో సర్వసభ్య సమావేశం నిర్వహించడంజరుగుతుందన్నారు. ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షులు ఎ. విద్యాసాగర్, యండి ఇక్బాక్, జిల్లా నాయకులు సమావేశనికి హాజరు కానున్నారని తెలిపారు. సర్వసభ్య సమావేశంలో ప్రస్తుత కార్యవర్గ పదివీ కాలం లో నిర్వహిరచిన కార్యక్రమం వివరాలు ప్రగతి నివేదిక జమాఖర్చుల వివరాలను సమర్పించి అమోదం పొందడం జరుగుతుందన్నారు. రానన్ను కాలలో 12 వ పిఆర్సి అమలు సిపిఎస్ రద్దు, డిఎ బకాయి విడుదల, పెండింగ్ బిల్లులు చెల్లింపు, హెల్త్ కార్డుల వినియోగం వంటి ముఖ్య డిమాండ్లను సాధించేందుకు నూతన కార్యవర్గాన్ని ఎన్నికకు సహకరించాలన్నారు .సర్వ సభ్య సమావేశానికి సభ్యులు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొనిసమావేశాన్ని జయప్రదం చేయాలని ఏపీ ఎన్జీవో నగర శాఖ అధ్యక్ష కార్యదర్శులు జె. స్వామి, సంపత్ కుమార్‌లు కోరారు.

సాఫ్ట్ టెన్నిస్ అసోసియేన్ల ఎన్నిక

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: కృష్ణాజిల్లా సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్, ఎన్టీఆర్ జిల్లా సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ ఎన్నిక ఏకగ్రీవమైందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.స్టాలిన్ ప్రకటించారు. ఆదివారం పటమటలోని శ్రీ విశ్వభారతి విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో సర్వసభ్య సమావేశం జరిగింది. అనంతరం జరిగిన ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. ఈ ఎన్నికలకు రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.గంగాధరరావు, కృష్ణాజిల్లా క్రీడా ప్రాధికార సంస్థ నుండి ఎస్.సంతోష్ కుమార్, ఎన్టీఆర్ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ నుండి పి.ఇసాక్ పర్యవేక్షకులుగా హాజరయ్యారన్నారు. 2022-26 నాలుగు సంవత్సరాల పాటు నూతన కార్యవర్గం ఉంటుందని పేర్కొన్నారు. కృష్ణాజిల్లా అధ్యక్షునిగా వి.శ్రీనుబాబు, ఉపాధ్యక్షులుగా వై.దామోదరరెడ్డి, డి.వినయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా డి.దిలీప్‌కుమార్, సంయుక్త కార్యదర్శులుగా డి.నవీన్‌కుమార్, ఎండి.జాహిరుద్దీన్, కోశాధికారిగా కె.రవికుమార్, కార్యవర్గ సభ్యులుగా వి.ప్రసన్నకుమార్, వి.భార్గవి ఎన్నికయ్యారు. ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షునిగా ఎమ్.చంటిబాబు, ఉపాధ్యక్షులుగా అబ్దుల్ కరీమ్, బి.ఉదయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా కె.దిలీప్ ప్రసన్నబాబు, సంయుక్త కార్యదర్శులుగా ఎం.దివ్యజ్యోతి, డి.సత్యనారాయణ, కోశాధికారిగా ఎన్.నాగబాబు, కార్యవర్గ సభ్యులుగా కె.నరసింహారావు, ఎస్.సత్యనారాయణ ఎన్నికయ్యారు.

మొదటిపేజీ తరువాయి

గుండె పరీక్షలు తప్పనిసరి

అవరుగా తక్షణమే వైద్యం అందిస్తే ప్రాణాపాయ స్థితి నుంచి తప్పించుకోవచ్చునన్నారు. మచిలీపట్నం మాజీ పార్లమెంట్ సభ్యులు కొనకళ్ళ నారాయణరావు మాట్లాడుతూ తన పుట్టిన ఊరిపై ప్రేమతో పళ్లెం పెద్దేశ్వరావు ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారన్నారు. జన్మభూమిపై మమకారం అందరికీ ఉండాలని, వైద్య వృత్తిలో సేవా తత్పరత పెరగాలని ఆయన కోరారు. సభకు అధ్యక్షత వహించిన లయన్స్ క్లబ్ జిల్లా కోఆర్డినేటర్ లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ పేదవారికి సహాయం చేద్దామని అడిగిన వెంటనే డాక్టర్ పల్లెం ముందుకు వచ్చినందుకు నియోజకవర్గం ప్రజలు తరపున ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. వైద్యులు నెలలో ఒకటి రెండు రోజులు పేదవారు ఉండే చోటికి వచ్చి సేవలందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వైసిపి నాయకుడు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) మాట్లాడుతూ మచిలీపట్నం ప్రజలంటే డాక్టర్ పళ్లెం పెద్దేశ్వరావు ప్రత్యేక అభిమానం ఉందన్నారు. చాలామంది తన ద్వారా వెళ్లి ప్రాణాలతో బయట పడ్డారన్నారు. డాక్టర్ వృత్తికే వన్నె తెచ్చే వ్యక్తుల్లో పల్లెం పెద్దేశ్వరరావు ఒకరిని కిట్టు అన్నారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు పుప్పాల ప్రసాద్ మాట్లాడుతూ క్లబ్ తరుపున నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. లయన్స్ క్లబ్ కార్యదర్శి పంచ పర్వాల ప్రభాకర్ రావు మాట్లాడుతూ వైద్య శిబిరంలో 1200 మంది పైగా ఉచిత సేవలను అందజేసినట్లు తెలియజేశారు. సేవా శిబిరంలో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ సభ్యులు, స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ ప్రతినిధులు మజ్జిగ, బిస్కెట్ ప్యాకెట్లు, పులిహోర, మంచినీరు ప్యాకెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పల్లెం ఆకాష్, కార్పొరేటర్లు కాగిత జవహర్లాల్ నెహ్రూ, గాజుల భగవాన్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు పంచపర్వాల సత్యనారాయణరావు, గొట్టిముక్కల రామ బ్రహ్మం, ధవలేశ్వరం ఉమామహేశ్వరరావు, మాల్యాద్రి, గోరంట్ల ప్రసాద్, పంచపర్వాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా లబ్దిదారులకు సంక్షేమ పథకాలు

ఎంత మంది , వారికి ఏడాదికి ఎంత ఇస్తున్నారు?

జవాబు: పింఛన్ దారులు జిల్లాలో రెండు లక్షల 27 వేల 124 మంది ఉన్నారు. వీరికి నెలకు రూ. 58 కోట్లు ఇస్తుండగా (17 రకాల పింఛన్లు) ఏడాదికి రూ. 696 కోట్లు పంపిణీ జరుగుతుంది.

ప్రశ్న: మహిళా మార్ట్‌ను జిల్లాలో ఎక్కడ తొలి సారిగా ఏర్పాటు చేస్తున్నారు.?

జవాబు: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించడానికి మహిళా మార్ట్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనిలో భాగంగానే జిల్లాలోని విసన్నపేటలో మార్ట్‌ను త్వరలో ప్రారంభించడం జరుగుతుంది. దీనిని శనివారం పరిశీలించడం కూడా జరిగింది.

ప్రభుత్వ మద్యం దుకాణంలో అవినీతి

దుకాణంలో అవకతవకలు జరిగాయి. కానీ అధికారులు పట్టించుకోకుండా రాజకీయ ఒత్తిళ్ళకు తలొగ్గి ఎలాంటి చర్యలు తీసుకోకుండా సిబ్బందిని వదిలి వేశారు. మళ్లీ అదే దుకాణంలో సుమారు రూ.31 లక్షలు దుర్వినియోగంపై అభియోగం వచ్చింది. కేవలం రాజకీయ ఒత్తిళ్ల కారణంగానే ఎక్సైజ్ అధికారులు అలసత్వం ప్రదర్శించడం మూలంగానే ఇంతా పెద్ద మొత్తంలో అవినీతికి సిబ్బంది పాల్పడ్డారని పలువురు ఆరోపిస్తున్నారు.

'బ్రాహ్మణులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి'

ప్రజాశక్తి-విజయవాడ: బ్రాహ్మణుల అభివద్ధికి, సంక్షేమానికి గతంలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని అమలు చేయాలని బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య కార్యవర్గం సమావేశంలో తీర్మానం చేసినట్లు రాష్ట్ర అధ్యక్షులు సత్యవాడ దుర్గాప్రసాద్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య కార్యవర్గ సమావేశం గాంధీనగర్‌లోని ఫిలిం ఛాంబర్లో ఆదివారం నిర్వహించారు. అనంతరం విలేకరులతో దుర్గాప్రసాద్ విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో 25 లక్షల ముంది బ్రాహ్మణ సామాజిక వర్గం ప్రజలు ఉన్నారన్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా తమకు మేలు జరుగుతుందని ఎంతో ఆశించినా కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసేలా ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయన్నారు. నామినేటెడ్ పదవుల్లోనూ తమకు అన్యాయమే జరిగిందన్నారు. కార్పొరేషన్ నిధులను ప్రభుత్వ పథకాలకు మళ్లించి తమ సామాజిక వర్గానికి అన్యాయం చేస్తున్నారన్నారు. తమ సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించకుంటే మూడు నెలల తర్వాత బ్రహ్మ గర్జన నిరసన కార్యక్రమాన్ని చేపడతామన్నారు. రాష్ట్ర కార్యదర్శి కోనూరు నతీష్ శర్మ మాట్లాడుతూ బ్రాహ్మణ



సామాజిక అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. తమకు ఉన్న స్వయం ప్రతిపత్తి గల సొసైటీకి పాలకవర్గాన్ని నియమించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అనంతరం రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులుగా నియమితులైన మల్లాది విష్ణును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి హెచ్.కె.మనోహర్, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు రెంటచింతల దీప్తి, సూరంపూడి కామేష్, కొల్లూరు శ్రీనివాసమూర్తి, ప్రయాగ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బొడ్డు నాగేశ్వరరావు

యుటిఎఫ్ గన్నవరం మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-గన్నవరం

యుటిఎఫ్ గన్నవరం మండలం కమిటీ గౌరవ అధ్యక్షులుగా దాసరి నవభారతి, అధ్యక్షులుగా జి.రవిబాబు, సహాధ్యక్షులుగా టి.బాలాజి, సహాధ్యక్షురాలుగా డి.నాగసూర్యకుమారి, ప్రధాన కార్యదర్శిగా జి.రాజబాబు, కోశాధికారిగా డి.శివప్రసాద్, కార్యదర్శులుగా హెచ్.రత్నకుమారి, జె.కుమారి, డి.వెంకటేశ్వరరావు, బి.జ్ఞానానందం,కె.ఉమాశంకర్, సి.హెచ్.వి.రాధాకృష్ణ, ఎం.వి.చలపతిరావు, బి.వెంకటేశ్వరనాయక్, డి.కుమార్, ఆడిటర్‌గా జె.రామారావు ఎన్నికయ్యారు.మాజీ శాసనమండలి సభ్యులు బొడ్డు నాగేశ్వరరావు సందేశం ఇచ్చారు.

సంఘటితమైతేనే సమస్యలకు పరిష్కారం : సిఐటియు

ప్రజాశక్తి - గుడివాడ

కార్మికులు సంఘటితం కావటం ద్వారా సమస్యలను పరిష్కరించుకోగలమనీ, హక్కులను సాధించుకుంటామని జిల్లా గ్రామీణ మహిళా (సిఐటియు అనుబంధం) కన్వీనర్ పి.ధనశ్రీ అన్నారు. సిఐటియు నందివాడ మండల 5వ మహాసభ సీతామహాలక్ష్మి అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ



నందివాడలో మాట్లాడుతున్న ధనశ్రీ

సందర్భంగా ధనశ్రీ మాట్లాడుతూ నందివాడ మండలంలో ఆక్వాగా మారడం వల్ల ఉపాధి లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ సి పి రెడ్డి మాట్లాడుతూ హక్కుల సాధన కోసం జరిగే పోరాటాల్లో అందరూ పాల్గొనాలని కోరారు. సిఐటియు నందివాడ మండల అధ్యక్షురాలుగా డి.సరోజిని, ఇ.రత్నకుమారి, ఉపాధ్యక్షులుగా డి.నాగమల్లి, కోశాధికారి డి.మనిషా ఎన్నికయ్యారు. మరో ఐదుగురు కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు.

సిఐటియు నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-బంటుమిల్లి

సిఐటియు బదంటీశీఅవంటుమిల్లి మండల ఎనిమిదో మహాసభ కీర్తిశేషులు గుండా బత్తుల ఆంజనేయులు స్మారక భవనంలో ఆదివారం జరిగింది. సిఐటియు కృష్ణాజిల్లా కోశాధికారి బూర సుబ్రహ్మణ్యం హాజరై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల గురించి వివరించారు. అనంతరం నూతన కమిటీ ఎన్నిక జరిగింది. మండల అధ్యక్ష కార్యదర్శులుగా బొర్రా రత్నకుమారి, మాజేటి శివ శ్రీనివాసరావు, కోశాధికారిగా కొమ్మలపాటి రవి ఎన్నికయ్యారు. మరో 19 మంది కమిటీ సభ్యులు ఎన్నికయ్యారు.


మాట్లాడుతున్న బూర సుబ్రహ్మణ్యం

నేటి నుంచి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి మహోత్సవాలు

ప్రజాశక్తి-మోపిదేవి

మోపిదేవి శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి మార్గశిర షష్ఠి మహోత్సవాలు సోమవారం నుంచి జరగనున్నాయి. బుధవారం వరకు అత్యంత వైభవంగా నిర్వహిస్తామనీ, సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేశామని చల్లపల్లి ఎస్టేట్ దేవాలయాల సహాయ కమిషనర్ నల్లసూర్య చక్రధరరావు తెలిపారు. మార్గశిర షష్ఠి మహోత్సవాల్లో భాగంగా మొదటి రోజైన సోమవారం ఉదయం 11 గంటలకుశ్రీ స్వామి వారిని పెండ్లి కుమారునిగా అలంకరించి ఆలయ ప్రధాన అర్చకులు బుద్దు పవన్ కుమార్ బ్రహ్మత్వంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. సాయంత్రం ఏడు గంటలకు విఘ్నేశ్వర పూజ, వాస్తు పూజ,అంకురారోపణ, నీరాజనం మంత్రపుష్పం, తదితర పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేస్తారని పేర్కొన్నారు. షష్ఠి మహోత్సవాల సందర్భంగా ఆలయం పూర్తిగా సర్వ వర్ణ శోభితమైన విద్యుత్ దీపాలతో


ఏర్పాట్లు పరిశీలిస్తున్న చక్రధరరావు

అలంకరించామన్నారు. శ్రీ స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులకు క్యూ లైన్ ల ఏర్పాటు, లడ్డు పులిహోర ప్రసాదం సరఫరా తదితర ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చల్లపల్లి ఎస్టేట్ దేవాలయాల సహాయ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు తెలిపారు. ఆదివారం సాయంత్రం ఆలయంలో ఏర్పాట్లను పర్యవేక్షించి ఆలయ సిబ్బందికి తగు సూచనలు, సలహాలు సహాయ కమిషనర్ చక్రధరరావు తెలిపారు. షష్ఠి మహోత్సవాల సందర్భంగా సోమవారం శ్రీ స్వామివారి మహా రుద్రాభిషేకం సేవలు తాత్కాలికంగా నిలిపి వేస్తున్నట్లు, మంగళవారం కళ్యాణ మహోత్సవం కారణంగా శ్రీ స్వామి వారి ఆర్జిత సేవలు పూర్తిగా నిలిపివేస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు బద్దు పవన్ కుమార్ శర్మ ఆదివారం తెలిపారు. షష్ఠి మహోత్సవాలకు యాత్రికులు పెద్దఎత్తున వచ్చే అవకాశం ఉన్నందున అధికార యంత్రాంగం ప్రత్యేక ఏర్పాట్లు చేసిందని ప్రధాన అర్చకులు కోరారు.

వ్యకాస రాష్ట్ర మహాసభల గోడపత్రికలు ఆవిష్కరణ

ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్


పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా ఉపాధి హామీ పథకం కూలి రేట్లు పెంచాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు అబ్దుల్ బారి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. డిసెంబరు 8 ,9, 10 తేదీల్లో జంగారెడ్డిగూడెంలో జరగనున్న ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం 29వ రాష్ట్ర మహాసభ సందర్భంగా శనివారం హనుమాన్ జంక్షన్ సిఐటియు కార్యాలయంలో గోడ పత్రికను ఆవిష్కరించారు. ఆ సంఘం మండల అధ్యక్షుడు కోరం రవి, కెవిపిఎస్ జిల్లా నాయకులు కొత్తూరు కిషోర్ , క్రా రవి, రాజనాల సురేష్ తదితరులు పాల్గొన్నారు. **గన్నవరం :** డిసెంబర్ 8వ తేదీన జంగారెడ్డిగూడెంలో జరగనున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం గన్నవరంలో పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు మల్లంపల్లి ఆంజనేయులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మచారి, మిరప నాగేశ్వరరావు, రాజేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు. **చల్లపల్లి :** డిసెంబర్ 8,9,10 తేదీల్లో జంగారెడ్డిగూడెంలో జరిగే రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు యద్దనపూడి మధు కోరారు. మండల వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుల ంబండారు కోటేశ్వరరావు, నాయకులు గోళ్ళ సాంబశివరావు, మాతంగి లక్ష్మయ్య, లంకపల్లి సత్యం, బళ్ళ వెంకటేశ్వరరావు, ఏసుపాదం తదితరులు పాల్గొన్నారు.


చల్లపల్లిలోపోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్

బాపులపాడు మండలం వీరవల్లిలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ప్రాంగణంలో 1996-97 పూర్వ విద్యార్థుల సమ్మేళనం సిల్వర్ జూబ్లీ ఆనందోత్సాహాల నడుమ సందడిగా జరిగింది. వివిధ ప్రదేశాల్లో ఉద్యోగ, వ్యాపారస్తులతో పాటు


అపూర్వ కలయికలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

వివిధ రంగాల్లో స్థిరపడిన మిత్రులంతా తిరిగి బాల్యంలో విద్యాబుద్ధులు నేర్చుకున్న పాఠశాలలో కలుసుకున్నారు. అలనాడి స్నేహానుభూతులను పంచుకున్నారు. 25 ఏళ్ల తర్వాత పాఠశాలకు చెందిన 1996-97 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. చిన్ననాటి స్నేహితులు కుశల ప్రశ్నలు వేసుకున్నారు. బాల్యంలోని మధుర స్మృతులను నెమరవేసుకున్నారు. పాఠశాలలో చదువుకునేటప్పుడు చేసిన చిలిపి చేష్టలు, చిరు తగా దాలు, ఉపాధ్యాయులకు పెట్టిన మారు పేర్లు తోటి స్నేహితులపై వేసిన జోకులు గుర్తుచేసుకున్నారు. భవిష్యత్తుకి బాటలు వేసిన గురువులను మరిచిపోకుండా గురువులను ఘనంగా సన్మానించారు.బంగారు భవిష్యత్తు బాటలు వేసిన విద్యాలయానికి తమ వంతు సహకారం అందించాలనే ఉద్దేశంతో పూర్వ విద్యార్థులు ప్రధానోపాధ్యాయులు నిర్మలకి చైర్ అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న.తోటి మిత్రుడు షేక్ మీరావలికి రూ.30 వేలు ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు చేసిన దాన్సులు ఆకట్టుకున్నాయి. పూర్వపు ఉపాధ్యాయులు దివి కపరాజు ,లీలాకుమారి , అమయలింగేశ్వరావు , వెంకట్రావు , దివి జవహర్ లాల్ , జయరామ్ ,జేవిడి ప్రసాదరావు , కొల్లి జగదీశ్వరావు, లక్ష్మీరమ పూర్వ విద్యార్థులు షేక్ మస్తాన్ , రాజా రమేష్ , ఉసా హేమంత్ , చందు రాజా , పోతురాజు , వెంకట్రావు , నవీన్ , చింతా ప్రసన్న , సుంకర శ్రీనివాసరావు , భారతీ , మీనాక్షి , కల్యాణి , సౌజన్య ,పూర్ణిమ , రాణీ ,శిరీషా ,నాగమలేశ్వరి , శశికళ ,సుజాత పాల్గొన్నారు.

లేప్రోస్కోపిక్ శస్త్ర చికిత్సలపై అవగాహన

ప్రజాశక్తి-అవనిగడ్డ

లేప్రోస్కోపిక్ చికిత్సలపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని తెనాలి స్పెషాలిటీ హాస్పటల్ వైద్యులు డాక్టర్ చందు ఉదయ భాస్కర్ తెలిపారు. ఆదివారం అవనిగడ్డ గాంధీ క్షేత్రం ఆవరణలో దివి గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ కలయిక కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. లాప్రోస్కోపిక్ సర్జరీ అంటే కోత నొప్పి లేని ఆపరేషన్ అని దీనికి దీర్ఘకాలం రెస్ట్ తీసుకోవాల్సిన అవసరం


మాట్లాడుతున్న డాక్టర్ చందు ఉదయభాస్కర్

కూడా ఉండదన్నారు. గాయం మానిపోయినా మచ్చ మాత్రం అలాగే ఉండిపోతుందన్నారు. ఆ గాయం తాలూకా మచ్చలు మనల్ని జీవితమంతా బాధ పెడుతూనే ఉంటాయన్నారు. సంప్రదాయ పద్ధతుల్లో చేసే ఆపరేషన్‌తో పోలిస్తే లేప్రోస్కోపిక్ పద్ధతిలో చేసే ఆపరేషన్‌కి కోత అనేది ఉండదన్నారు. ఆపరేషన్ సమయంలో రక్తస్రావం కూడా ఉండదని తెలిపారు. ఈ పద్ధతిలో గర్భసంచి, హెర్నియా ఆపరేషన్, 24 గంటల కడుపునొప్పి, పసరుతిత్తి మొదలైన సమస్యలకు లేప్రోస్కోపిక్ ఆపరేషన్లు చేస్తామని తెలిపారు. అందువల్ల ప్రజలందరూ తక్కువ ఖర్చు తక్కువ సమయం నొప్పి లేని ఈ విధానాన్ని ఉపయోగించుకునేలా గ్రామీణ వైద్యులు ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దివి గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షులు మోకా బుచ్చిబాబు, కార్యదర్శి కేవీఎల్ కోటేశ్వరరావు, గ్రామీణ వైద్యుల సంఘం సలహా మండల చైర్మన్ బడే బావన్నారాయణ, దివి మల్టీ స్పెషాలిటీ మార్కెటింగ్ మేనేజర్ గోపాలకృష్ణ, గ్రామీణ వైద్యులు పాల్గొన్నారు.

ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలి: లకనం

ప్రజాశక్తి-అవనిగడ్డ

రాష్ట్రంలోని బోటు డ్రైవర్ల ఉద్యోగ ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని ఆంధ్రప్రదేశ్ సంప్రదాయ మత్స్యకారుల సేవా సంఘం ప్రధాన కార్యదర్శి లకనం నాగాంజనేయులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం అవనిగడ్డలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో పర్యాటకశాఖలోని డ్రైవర్, కళాసిలు నేషనల్ వాటర్ కమిషన్‌లోని ఉద్యోగాలతో పాటు నావిగేషన్ సహాయకులు ఉద్యోగ ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలన్నారు. దశాబ్ద కాలంగా ఈ ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయకపోవడం వలన టీం దాల్ కం డ్రైవర్లుగా శిక్షణ పొందిన నిరుద్యోగు లు కుటుంబాలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. పర్యాటకులకు ఆహ్లాదాన్ని కలిగించడంతోపాటు ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చే పర్యాటక రంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేయడం తగదని నాగాంజనేయులు సూచించారు.

శ్యామ్ కిషోర్ ఆర్థిక సాయం

ప్రజాశక్తి-అవనిగడ్డ

అవనిగడ్డ ఎనిమిదో వార్డుకు చెందిన నలకుర్తి రమేష్ శనివారం రాత్రి మతి చెందగా విషయం తెలుసుకున్న శ్రీరామ వెల్ఫేర్ సొసైటీ నిర్వాహకులు తోట శ్యామ్ కిషోర్ నాయుడు ఆదివారం ఆ కుటుంబాన్ని పరామర్శించి మతుడి కుటుంబానికి అంత్యక్రియలు నిమిత్తం రూ 5 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నలుకుర్తి పద్మీరాజ్ గ్రామ పెద్దలు నలుకుర్తి వెంకటేశ్వరరావు నలుకుర్తి ఏసుబాబు పులివర్తి చిన్న మునిపల్లి ఏలియా తదితరులు పాల్గొన్నారు.


ఆర్థిక సహాయం అందజేస్తున్న తోట శ్యామ్‌కిశోర్‌నాయుడు


మాట్లాడుతున్న కొనకళ్ల నారాయణరావు

ఐక్యంగా ఉంటేనే అన్ని రంగాల్లో రాణించగలం

రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్

ప్రజాశక్తి - విజయవాడ రూరల్

రాష్ట్రంలోని గౌడ సంఘీయులంతా ఐక్యంగా ఉండటంతోపాటు ఆర్థికంగా వెనుకబడిన వారికి ఇతోధికంగా సహకారం అందించాలని రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ సూచించారు. ఈ విషయంలో రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలని కోరారు. విజయవాడ రూరల్ మండలం కొత్తూరు తాడేపల్లి గౌడ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన కార్యక్రమాన్ని పురస్కరించుకుని కొత్తూరు తాడేపల్లిలో ఆత్మీయ కలయిక కార్యక్రమం ఆదివారం జరిగింది. మంత్రి రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వం కల్లుగీత కార్మికుల కోసం నూతన పాలసీని తెచ్చిందని, దీనివల్ల ప్రమాదవశాత్తు మరణించిన వారికి ప్రస్తుతం ఇచ్చే నష్టపరిహారాన్ని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచినట్లు తెలిపారు. గాయపడిన వారికి ప్రత్యామ్నాయ ఉపాధిని కల్పించనున్నట్లు తెలిపారు. మాజీ ఎంపీ, తెలుగుదేశం పార్టీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ సంఘీయులంతా బలోపేతం కావాల్సిన అవసరం ఉందన్నారు. ఒకరికొకరు సహకరించుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ కార్పొరేషన్ చైర్మన్ మాదు శివరామకృష్ణ, నూజివీడు డీఎస్పీ ఈడే అశోక్ కుమార్ గౌడ్, గన్నవరం ఎంపీపీ అనగాని రవి, జీ కొండూరు ఎంపీపీ వేములకొండ తిరుపతమ్మ, కొత్తూరు తాడేపల్లి సర్పంచ్ ఉయ్యూరు గోపాలరావు, సంఘం ప్రతినిధులు దొంతగాని వెంకటేశ్వరరావు, వేములకొండ నాగరాజు, పరికల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మరుపిళ్ల చిట్టి సేవలు చిరస్మరణీయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-వన్‌టౌన్: మాజీ ఎమ్మెల్యే మరుపిళ్ల చిట్టి 124వ జయంతి వేడుకలు పశ్చిమ నియోజకవర్గంలోని పలు ప్రాంతాలలో ఆదివారం నిర్వహించారు. స్థానిక మరుపిళ్ల చిట్టి పార్కు వద్ద వైసిపి నాయకులు రాయన నరేంద్ర ఆధ్వర్యంలో



నిర్వహించారు. ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి పాల్గొని చిట్టి విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ శాసనసభ్యునిగా మరుపిళ్ల చిట్టి చేసిన సేవలు నిరుపమానమన్నారు. ఈ కార్యక్రమంలో దుర్గగుడి మాజీ చైర్మన్ పైలా సోమినాయుడు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కొనకళ్ల విద్యాధరరావు, శ్రీ నగరాల సంఘం అధ్యక్షులు ఎన్‌వి రావు తదితరులు పాల్గొన్నారు. 51వ డివిజన్ కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రాజేష్‌తో పాటు వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొని చిట్టికి నివాళులర్పించారు.



సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలి : సిఐటియు

ప్రజాశక్తి-వన్‌టౌన్: కేంద్రంలోనీ బిజెపి, రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ విధానాలపై సమరశీల పోరాటానికైనా సిద్ధం కావాలని కార్మికులకు ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు ఎ.వెంకటేశ్వరరావు, కార్యదర్శి ఎన్‌సిహెచ్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సిఐటియు పశ్చిమ నగర 16వ మహాసభ ఆదివారం మోటూరి హనుమంతరావు శ్రామిక భవనంలో జరిగింది. తొలుతగా సిఐటియు జెండాను ముఠా వర్కర్స్ యూనియన్ నాయకులు పి. యరకయ్య ఆవిష్కరించారు. అనంతరం ఇటీవల మతి చెందిన కార్మికులు ఎస్ ఎం సుభాని, కే సురేష్, ఎస్.వి పెద్ద చెంచయ్య, ఎం అప్పలస్వామి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఒక నిమిషం మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఈవి నారాయణ అధ్యక్షత వహించిన ఈ సభలో ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు ఎ. వెంకటేశ్వరరావు, శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేసేందుకు ప్రధాని మోడీ ప్రయత్నించడం బాధాకరమన్నారు. నూతనంగా తీసుకొస్తున్న లేబర్ కోడ్‌ల వల్ల కార్మికులకు వున్న హక్కులు, చట్టాలు, రద్దు అవుతాయని దీనితో యజమానులకు కట్టు భానిసలుగా కార్మికులు వుండాల్సి వస్తుందని అన్నారు. నేడు ముఠా రంగంలో కొత్త పరిణామాలు చోటు చేసుకుంటున్నాయని, ఆటో రంగం కుదేలవుతుందన్నారు. వైసిపి ప్రభుత్వం కార్మికుల ఆటోలపై



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి శ్రీనివాస్

వివిధ రకాల పన్నులు, పోలీసులు కేసులు రూపంలో వేలకు వేల రూపాయులు చలానాల రూపంలో వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో నిత్యావసర ధరలు పెరిగిపోయాయని సామాన్య మానవుడు, పేద మధ్య తరగతి కుటుంబీకులు, కార్మికులు, జీవన భతి కష్టతరంగా మారిందన్నారు. అన్ని వర్గాలను ఆదుకుంటామని చెప్పి అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం కార్మికుల కష్టాన్ని దోచుకుంటుందన్నారు. కార్మికులకు వేతన సవరణలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరినా పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు సాధించుకునేందుకు పోరాటం చేయాలన్నారు. మునిసిపల్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవాలని, స్కీం వర్కర్లకు పని భారం తగ్గించి సెలవులు, ఇఎస్ఐ, పిఎఫ్‌లు అమలు చేయాలన్నారు. డిసెంబర్ 15, 16 తేదీలలో వన్‌టౌన్‌లో మాడపాటి క్లబ్ నందు జరిగే సిఐటియు ఎన్‌టిఆర్ జిల్లా 11వ మహాసభను జయప్రదం చేయాలని మహాసభ తీర్మానించినట్లు తెలిపారు. కార్మికులంతా కలిసికట్టుగా ఉద్యమాలకు సిద్ధం కావాలని సిఐటియు అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పశ్చిమ సిటీ కార్యదర్శి బోయి సత్యబాబు, అధ్యక్షులు నారాయణ, ఎస్.సుబ్బారెడ్డి, సీనియర్ నాయకులు యస్. నారాయణ రెడ్డి, కె.సూరిబాబు, వెంకటరావు (చౌదరి), బాబు ఖాన్, సాంబులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి పి.అప్పన్న విప్లవ గేయాలు ఆలపించారు. సభా కార్యక్రమాలు అనంతరం సిఐటియు పశ్చిమ సిటీకి 43 మందితో నూతన కమిటీ నియామకం జరిగింది. 13 మందితో కార్యదర్శి వర్గం ఎంపికైంది. నూతన కమిటీ అధ్యక్షుడుగా జి.వెంకటరావు (చౌదరి), ప్రధాన కార్యదర్శిగా ఇ.వి.నారాయణ, ఉపాధ్యక్షులుగా సిహెచ్ దాసు, వి.సాంబులు, బి.సత్యబాబు, జి.రాంబాబు, ఎ.సుభాషిణి, కార్యదర్శులుగా ఎస్.సుబ్బారెడ్డి, ఎస్.డి. కరీముల్లా, ఎస్.లక్ష్మి, వై. ఆదిలక్ష్మి, కోశాధికారిగా బాబూఖాన్ ఎన్నుకోబడ్డారు.

మంచినీటిని సరఫరా చేయకుంటే ప్రజా ఆందోళన

32వ డివిజన్ పర్యటనలో బాబూరావు

ప్రజాశక్తి-విజయవాడ: నీటి కాలుష్యాన్ని అరికట్టి, స్వచ్ఛమైన రక్షిత మంచినీటిని అందించి ప్రజారోగ్యాన్ని కాపాడాలని, లేకపోతే ప్రజాఆందోళన తప్పదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు హెచ్చరించారు. స్థానిక 32వ డివిజన్‌లో ఆదివారం సిపిఎం నేతలు పర్యటించి, స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా డివిజన్‌లో కలుషిత మంచినీటి సమస్య వల్ల ఎదుర్కొంటున్న ఇబ్బందులను స్థానిక ప్రజలు సిపిఎం నేతలకు వివరించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ నగర ప్రజలపై చెత్త పన్ను, నీటి పన్ను, డ్రైనేజి పన్ను, ఆస్తి పన్ను తదితర రూపాల్లో భారాలు మోపడం తప్ప, ప్రజల సంక్షేమం, వారి ఆరోగ్యాలు ప్రభుత్వానికి, నగరపాలక సంస్థకు పట్టడంలేదని విమర్శించారు. నగరపాలక సంస్థకు నీటి చార్జీలు చెల్లిస్తూనే, మినరల్ వాటర్ ప్లాంట్ల వద్ద మంచినీరు కొనుక్కోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. చాలా రోజుల నుంచి నీటి కాలుష్యంపై ప్రజలు గగ్గోలు పెడుతున్నా, అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నా విఎంసి యంత్రాంగంలో స్పందన కరువైందని స్థానిక ప్రజలు తెలుపుతున్నారన్నారు. సచివాలయ వ్యవస్థ, వాలంటీర్ల వ్యవస్థ ఉన్నా ప్రయోజనం లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా నగరపాలక స్పందించి నీటి


కలుషిత నీటిని బాబూరావుకు చూపుతున్న ప్రజలు

కాలుష్యాన్ని తక్షణమే అరికట్టాలని, ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం, నగరపాలక సంస్థ ఖజానా నింపుకోవడంపై కాకుండా ప్రజలకు సదుపాయాలు కల్పించడంపై దష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. ప్రతి సంవత్సరం మంచినీటి చార్జీలను, ఇంటి పన్నులను పెంచుతూ ప్రజలపై భారాలు మోపుతున్నారని అన్నారు. ప్రజలకు సదుపాయాలు కల్పించడంలో పాలకులు విఫలమవుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి బి.రమణరావు, స్థానిక నాయకులు సుందర రామరాజు, పద్మ తదితరులు పాల్గొన్నారు.

బియ్యం, సరుకులు అందజేత

ప్రజాశక్తి-వన్‌టౌన్

50వ డివిజన్ గొల్లపాలెం గట్టు కొండ ప్రాంతంలో నడకుదిటి శివశంకర్ వ్యక్తి చనిపోవడం జరిగింది. వారి కుటుంబాన్ని 50వ డివిజన్ టీడీపీ అధ్యక్షులు కొప్పుల గంగాధర్, డివిజన్ ప్రధాన కార్యదర్శి కాళ్ల ఈశ్వర్, గొల్ల నాగసత్తి బాబు, పావని, తదితరులు ఆదివారం వారి నివాసానికి వెళ్ళి పరామర్శించారు. అనంతరం కుటుంబ సభ్యులకు బియ్యం, నిత్యావసర సరుకులు, కూరగాయలు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రామ్‌దేవ్ బాబాపై చర్యలు కోరుతూ నిరసన


రామ్‌దేవ్‌బాబా చిత్రపటానికి చెప్పుల దండలతో నిరసన తెలుపుతున్న మహిళా సంఘాల నాయకులు

ప్రజాశక్తి-విజయవాడ: ఆధ్యాత్మిక ప్రవచనాలు యోగా, మత ప్రవచనాలు ముసుగులో మహిళల పట్ల అసభ్యంగా వ్యాఖ్యలు చేసిన రామ్ దేవ్ బాబా మహిళా లోకానికి క్షమాపణ చెప్పాలని, సుమోటో కింద కేసు నమోదు చేసి తక్షణమే ఆయన్ను అరెస్టు చేయాలని పలు మహిళా సంఘాలు డిమాండ్ చేశాయి. జాతీయ మహిళా కమిషన్ స్పందించాలని మహిళా సంఘాలు ఆందోళన వ్యక్తం చేసారు.మహిళలు దుస్తులు లేకుండా ఉంటే అందంగా ఉంటారంటూ రామ్‌దేవ్ బాబా చేసిన అసభ్య వ్యాఖ్యలను నిరసిస్తూ మహిళా సంఘాలు ఆదివారం నగరంలోని ఊర్వశి సెంటర్ వద్ద ఆయన చిత్ర పటానికి చెప్పుల దండ వేసి చెప్పులతో కొడుతూ పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. రామ్‌దేవ్‌బాబా వ్యాఖ్యలను నిరశిస్తూ మహిళా సంఘాల నేతలు పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షులు కాట్రగడ్డ స్వరూపరాణి మాట్లాడుతూ గతంలో డెరా బాబా, నిత్యానంద బాబాలు భక్తి ముసుగులో ఆడ వారిని వంచించిన ఘటనలు మర్చిపోక ముందే నేడు గరికపాటి నరసింహారావు, రామ్‌దేవ్ బాబాలు కించ పరిచే వ్యాఖ్యలు చేయడం అత్యంత హేయమైన విషయం అన్నారు. మహిళా సంఘాలు ఐక్యంగా అన్ని జిల్లాలో పోలీస్ స్టేషన్‌లలో కేసులు పెట్టి, ఆందోళనకు సిద్ధం అవుతారని హెచ్చరించారు.తక్షణం మహిళలకు రామ్‌దేవ్ బాబా క్షమాపణ చెప్పాలని, లేనట్లయితే ఉద్యమం ఉధృతం అవుతుందని హెచ్చరించారు. ఇతని విషయంలో మహిళా కమిషన్ జోక్యం చేసుకొని అతనిపై కేసును నమోదు చేయించి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇటువంటి బాబాల వెనుక కేంద్రంలోని బిజెపి- మోడీ అండగా ఉన్నారని, అందుకనే నోటికి ఏదోస్తే అది మాట్లాడుతూ రెచ్చిపోతున్నారని, భవిష్యత్‌లో ఇటువంటి వ్యాఖ్యలు చేయకుండా తగిన విధంగా శాస్తి చెప్పాలని డిమాండ్ చేశారు.

భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ ఎఫ్ ఐ డబ్ల్యూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్మెత్స దుర్గాభవాని మాట్లాడుతూ మహిళలను కించపరిచే రీతిలో మాట్లాడిన రామ్‌దేవ్‌బాబా వినియోగ వస్తువులను పెద్ద ఎత్తున విక్రయిస్తూ నకిలీ వ్యాపారం చేస్తూ ప్రజల్ని మోసగిస్తున్నాడని విమర్శించారు. ఆరెస్సెస్ ముసుగులో ఉన్న కేంద్ర మంత్రులే కాకుండా, గరికపాటి నరసింహారావు, రామ్‌దేవ్ వంటి వాళ్లు కూడా కించ పర్చడం అత్యంత హేయమైన విషయం అని అవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపి మహిళా సమాఖ్య నగర ప్రధాన కార్యదర్శి పంచదార్ల దుర్గాంబ, ఐద్వా జిల్లా కార్యదర్శి కే శ్రీదేవి, మాజీ కార్పొరేటర్‌లు తమ్మిన దుర్గ, గాదే ఆదిలక్ష్మి, కాజ సరోజ,మహిళా సంఘాల నాయకులు ఓర్సు భారతి, నక్కా రాజ్యలక్ష్మి, దుర్గాసి రమణమ్మ, పుట్టగుంట సత్యవతి, కడవకొల్లు భారతి, వెంకటేశ్వరమ్మ,దుర్గ, షకీలా విక్రమ్ లక్ష్మి,దేవి తదితరులు పాల్గొన్నారు.